# విజయవాడలో ఆకట్టుకుంటున్న జాతీయ సరస్ మేళా

4 లో





# మనం



కృష్ణా / గుంటూరు
ఎన్‌టీఆర్ - బాపట్ల - పల్నాడు



ఆదివారం | 18 | అక్టోబర్ | 2026 | పేజీలు: 12





# జనసేనకు మేయర్... తమ్ముళ్లకు ఫికర్

# కూటమిలో రచ్చ.. టీడీపీ అసంతృప్తి

పి.మీరాహుస్సేన్ ఖాన్

మున్సిపల్ ఎన్నికల పర్వం ఊపందుకున్న వేళ, బెజవాడ రాజకీయాలు అత్యంత రసవత్తరంగా మారాయి. అధికార టీడీపీ-జనసేన-బీజేపీ కూటమిలో భాగంగా విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పీఠాన్ని జనసేనకు కేటాయించడం, సీట్ల పంపకాలపై ప్రతిష్టంభన ఏర్పడటంతో క్షేత్రస్థాయిలో తీవ్ర చర్చ నడుస్తోంది.

5 లో

-విజయవాడ, మనంబ్యూరో చీఫ్



తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి దుర్గమ్మ వారికి సారెను శనివారం మధ్యాహ్నం సమర్పించారు. ఆలయ అధికారులు తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మకర్తలు జాస్తి సాంబశివరావు, నన్నపనేని సదాశివరావు, ఆలయ సూపరిమెంట్ సూర్యనారాయణ టిటిడి సిబ్బంది సారెను అమ్మవారికి సమర్పించిన వారిలో ఉన్నారు. అమ్మవారికి సారె సమర్పించిన అనంతరం ఆశీర్వచన మండపంలో వేద పండితులు వారికి వేద ఆశీస్సులు అందజేశారు. ఆలయ ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ ( గాంధీ ) అమ్మవారి చిత్రపటాన్ని ప్రసాదాలను వారికి అందజేశారు.



# సిరులతల్లి చెంత నాద నీరాజనం

2 లో

నమస్తేస్తు మహామాయే శ్రీపీఠే
సురపూజితే
శంఖచక్ర గదాహస్తే మహాలక్ష్మి
నమోస్తుతే
సర్వజ్ఞే సర్వవరదే
సర్వదుష్ట భయంకరి
సర్వదుఃఖ హరే దేవి మహాలక్ష్మి
నమోస్తుతే







## సిరులతల్లి చెంత

# నాద నీరాజనం

**ఇంద్రకీలాద్రిపై పరిఢవిల్లిన దివ్య సాంస్కృతిక వైభవం**

**కొండపై అష్టైశ్వర్యాల ప్రదాత శ్రీ మహాలక్ష్మిగా జగన్మాత దర్శనం**

**కొండదిగువన భక్తితరంగాలతో పరవశించిన కళాక్షేత్రం**

**అమ్మవారి దివ్య సన్నిధిలో స్వరఝరి, హరికథా గానం, చిన్నారుల లయాన్విత శాస్త్రీయ నాట్యార్చన**

**ఉదయం నుండి రాత్రి వరకు నిర్విరామంగా కళార్చన**

**ఆధ్యాత్మిక తన్మయత్వంలో మునిగితేలిన లక్షలాది భక్తజనం**

**విజయవాడ, అక్టోబర్,17,(మనం న్యూస్):** శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో అత్యంత వైభవోపేతంగా జరుగుతున్న దసరా శరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా శనివారం శ్రీ కనకదుర్గా నగర్లోని కళావేదికపై సాంస్కృతిక, ఆధ్యాత్మిక శోభ పరిపూర్ణంగా వికసించింది. సకల లోకాలకు ఐశ్వర్యాన్ని, ఆయురారోగ్యాలను, సమస్త శుభాలను అనుగ్రహించే అష్టైశ్వర్యప్రదాయిని శ్రీ కనకదుర్గ అమ్మవారు ఇంద్రకీలాద్రి శిఖరాన పద్మాసనారూఢురాలై శ్రీ మహాలక్ష్మి దేవి దివ్యాలంకారంలో భక్తులకు కటాక్షాన్ని ప్రసాదిస్తున్నారు. కొండపై లక్ష్మీదేవి కటాక్ష వీక్షణాల కోసం భక్తజనం బారులు తీరగా, కొండదిగువన దుర్గా నామస్మరణతో, భక్తి ప్రవచనాలతో ప్రాంగణమంతా ఆధ్యాత్మిక తేజస్సుతో వెలిగిపోయింది. భగవదారాధనకు కళలే పరమోత్కృష్ట సాధనమనే నానుడికి అద్దం పడుతూ, గాన-సాహిత్య-నృత్యాల కలబోతగా సాగిన ఈ దివ్య కళార్చనలు అమ్మవారి దర్శనార్థం తరలివచ్చిన లక్షలాది భక్తజనాన్ని ఆధ్యాత్మిక ఆనందడోలికల్లో ఓలలాడించాయి.ఉదయం నుండి రాత్రి వరకు నిర్విరామంగా కొనసాగిన కళా ప్రదర్శనలు క్షేత్రంలో దివ్యమైన ఆధ్యాత్మిక తరంగాలను సృష్టించాయి. ఉదయం జి. శేషకుమారి బృందం సమర్పించిన గ్రామీణ తాళం భజనతో కళావేదిక భక్తిచైతన్యంతో ప్రారంభమైంది. మహాలక్ష్మి వైభవాన్ని, అమ్మవారి లీలలను కీర్తిస్తూ సిహెచ్. శాంతి, వి. లలిత నాగమణి, వి. లక్ష్మి వి. సత్యవల్లి ఆలపించిన భక్తిరంజని గీతాలు, దేవీ అష్టకాలు శ్రోతలను నాదబ్రహ్మంలో తేలియాడేలా చేశాయి. ప్రముఖ హరికథా విద్వాంసులు సిహెచ్. నాగబాబు సమర్పించిన హరికథా కాలక్షేపం భక్తులను విశేషంగా అలరించింది. లక్ష్మీ వైభవాన్ని, పురాణ గాథలను శ్రావ్యమైన గానం, అర్థవంతమైన అభినయంతో రంగరించి వివరించిన తీరు భక్తుల ప్రశంసలు అందుకుంది. శ్రీ మహాలక్ష్మి దేవి అనుగ్రహం కొరకు చిన్నారులు, యువ కళాకారులు లయాన్విత అడుగులు, సాత్విక అభినయ ముద్రలతో కూచిపూడి, భరతనాట్య రీతులలో అద్భుత నాట్య నివేదన సమర్పించారు. మరిశర్ల స్నిగ్ధ, టి. ఉమాదేవి, ఎం.ఎల్. వసుంధర, ఎం. యోషిత, సురేష్ గోపి, బి. ఉదయశ్రీ, పి. నాగభవాని, శ్రీ సాయి, బి. భాగ్య చంద్ర శ్రీ, ఎన్. లావణ్య, ఎన్. హరిప్రియ, బి. శ్రీజ, ఎన్. రిషిత సాన్వి, ఎం. చైత్ర, టి. రవికుమార్, కె. కృష్ణవేణి, పి. ప్రసాద్, ఎ. సంతోష్ ఈ కళాకారులు ప్రదర్శించిన మహాలక్ష్మి అష్టక నృత్యాలు, దేవీ స్తుతులు, శివ-శక్తి నృత్య రూపకాలు, అన్నమాచార్య కీర్తనలకు అభినయాలు ఆహూతులను మంత్రముగ్ధులను చేశాయి. క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు ఈ ప్రదర్శనలను తిలకిస్తూ శ్రమను మరచి ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందారు. కళారూపాల ద్వారా అమ్మవారిని ఆరాధించిన కళాకారులందరినీ ఆలయ అధికారులు ప్రత్యేకంగా ప్రశంసించి, దేవస్థానం తరపున శ్రీ అమ్మవారి శేషవస్త్రాలు,ప్రసాదాలు అందజేసి ఘనంగా సత్కరించారు.









## స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలి



▸ **ఎన్నికల నిర్వహణపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్ డీకే బాలాజి**

**మచిలీపట్నం: అక్టోబర్ 17,(మనం న్యూస్):** జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలను స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డీకే బాలాజి కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో భాగంగా శనివారం సాయంత్రం కలెక్టరేట్లోని తన ఛాంబర్లో జాయింట్ కలెక్టర్ ఎం నవీన్ తో కలిసి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం నిర్వహించి ఎన్నికల షెడ్యూల్, నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, అభ్యర్థుల అర్హతలు, రిజర్వేషన్లకు సంబంధించిన ధ్రువపత్రాలు తదితర అంశాలపై చర్చించారు. జిల్లాలో తొలుత మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైందని, అనంతరం జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అక్టోబర్ 21, 22, 23 తేదీల్లో నామినేషన్ల స్వీకరణ, 24న నామినేషన్ల పరిశీలన, అవసరమైతే 25న అప్పీళ్ల పరిష్కారం, 27న నామినేషన్ల ఉపసంహరణకు తుది గడువు ఉంటుందని వివరించారు. అదే రోజు పోటీలో నిలిచే అభ్యర్థుల తుది జాబితాను ప్రకటిస్తామని తెలిపారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు నవంబర్ 3న పోలింగ్, అదే రోజు ఓట్ల లెక్కింపు చేపట్టేలా షెడ్యూల్ ఉన్నట్లు పేర్కొన్నారు.ఎన్నికల ప్రక్రియకు సంబంధించి అభ్యర్థులకు, రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఎలాంటి సందేహాలు లేదా సమస్యలు ఎదురైనా సంబంధిత రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల అధికారులు లేదా తన దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. నామినేషన్ల సమయంలో అఫిడవిట్లు అసంపూర్తిగా సమర్పించడం, రిజర్వేషన్ స్థానాలకు అవసరమైన కుల ధ్రువపత్రాలు జతచేయకపోవడం వంటి లోపాల కారణంగా అభ్యర్థులు ఇబ్బందులు ఎదుర్కోకుండా నిబంధనలపై ముందుగానే అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. కుల ధ్రువపత్రాల జారీలో జాప్యం లేకుండా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ధ్రువపత్రాల్లో తప్పులు ఉన్నట్లయితే వాటిని సరిచేసుకునేందుకు అభ్యర్థులకు అవసరమైన మార్గదర్శకత్వం అందించాలని తెలిపారు. అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులను సమావేశాలకు లేదా ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన వివరణల కోసం పిలిచినప్పుడు అందుబాటులో ఉండాలని కలెక్టర్ కోరారు. జిల్లా ఎన్నికల అధికారి, మున్సిపల్ కమిషనర్లు, రిటర్నింగ్ అధికారులు లేదా ఎన్నికల అధికారులు పిలిచినప్పుడు హాజరై, ఎన్నికల నిర్వహణలో పారదర్శకతకు సహకరించాలని సూచించారు.సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు నామినేషన్లకు అవసరమైన ధ్రువపత్రాల జారీ, క్రిమినల్ కేసుల వివరాల సేకరణలో ఎదురవుతున్న జాప్యం, అఫిడవిట్ల నిబంధనలపై స్పష్టత, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు, ప్రభుత్వ పథకాల ప్రచార చిత్రాలు, బ్యానర్ల తొలగింపు వంటి అంశాలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఆయా సమస్యలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. ఎన్నికల నిర్వహణలో అన్ని రాజకీయ పార్టీలకు సమాన అవకాశాలు కల్పిస్తూ, నిబంధనలకు అనుగుణంగా ప్రక్రియను సజావుగా పూర్తి చేసేందుకు యంత్రాంగం కృషి చేస్తుందని ఆయన స్పష్టం చేశారు. సమావేశంలో డిఆర్ఓ కె శ్రీధర్ రెడ్డి, జెడ్పీ సీఈవో శ్రీహరి, మాజీమంత్రి వైయస్సార్సీపి జిల్లా అధ్యక్షుడు పేర్ని వెంకట్రామయ్య (నాని), బత్తిన దాసు (టీడీపీ), కొడాలి శర్మ సిపిఐ (ఎం), జనసేన, బిజెపి, బీఎస్పీ, కాంగ్రెస్ తదితర రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

## దుర్గమ్మకు సారె సమర్పించిన టీటీడీ



**విజయవాడ,అక్టోబర్, 17,(మనం న్యూస్):** తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి దుర్గమ్మ వారికి సారెను శనివారం మధ్యాహ్నం సమర్పించారు. ఆలయ అధికారులు తిరుమల తిరుపతి ధర్మకర్తలు జాస్తి సాంబశివరావు, నన్నపనేని సదాశివరావు, ఆలయ సూపరిమెంట్ సూర్యనారాయణ టీటీడి సిబ్బంది సారెను అమ్మవారికి సమర్పించిన వారిలో ఉన్నారు. అమ్మవారికి సారె సమర్పించిన అనంతరం ఆశీర్వచన మండపంలో వేద పండితులు వారికి వేద ఆశీస్సులు అందజేశారు. ఆలయ చైర్మన్ బొర్రా రాధాకృష్ణ ( గాంధీ ) అమ్మవారి చిత్రపటాన్ని ప్రసాదాలను వారికి అందజేశారు.



# నామినేషన్ల స్వీకరణలో ఎన్నికల నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలి

▸ **రేపు మధ్యాహ్నం 3 గంటల తర్వాత ఒక్క నామినేషన్ కూడా స్వీకరించరాదు**

▸ **ఆర్వోలు, ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ**



**మచిలీపట్నం, అక్టోబర్ 17,(మనం న్యూస్):** రెండవ సాధారణ స్థానిక సంస్థల ఎన్నికలు-2026లో భాగంగా నామినేషన్ల ప్రక్రియ రేపటితో ముగియనున్న నేపథ్యంలో, నామినేషన్ల స్వీకరణ, ఎన్నికల నియమ నిబంధనల అమలు, చివరి రోజు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అధికారులకు ఎదురవుతున్న సందేహాల నివృత్తి తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి డీకే బాలాజీ శనివారం సాయంత్రం సంబంధిత రిటర్నింగ్ అధికారులు (ఆర్వోలు), ఎన్నికల అధికారులతో వర్చువల్ విధానంలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, నామినేషన్ల స్వీకరణకు రేపు చివరి రోజు కావడంతో అధికారులు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని, ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలను, గడువులను కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. నామినేషన్ల స్వీకరణలో ఎటువంటి పొరపాట్లకు, నిబంధనల ఉల్లంఘనలకు తావులేకుండా అన్ని ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు.

### మధ్యాహ్నం 3 గంటల గడువును కచ్చితంగా పాటించాలి

రేపు నామినేషన్ల స్వీకరణ గడువు మధ్యాహ్నం 3 గంటలకు ముగుస్తుందని, నిర్ణీత గడువు ముగిసిన తర్వాత ఒక్క సెకను ఆలస్యమైనా ఎట్టి పరిస్థితుల్లోనూ కొత్త నామినేషన్లను స్వీకరించరాదని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. అయితే, గడువు ముగిసే సమయానికి ముందే నామినేషన్లు దాఖలు చేసేందుకు సంబంధిత ప్రాంగణంలో లేదా నిర్దేశిత గదిలోకి ప్రవేశించిన అభ్యర్థులు ఉన్నట్లయితే, వర్తించే ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా వారందరి నామినేషన్లను స్వీకరించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ విషయంలో సమయపాలన అత్యంత కీలకమని, నామినేషన్ల స్వీకరణకు సంబంధించిన నిబంధనలను ప్రతి రిటర్నింగ్ అధికారి, ఎన్నికల అధికారి స్పష్టంగా అర్థం చేసుకుని అమలు చేయాలని పునరుద్ఘాటించారు. చివరి రోజు అభ్యర్థులకు ఎటువంటి అనవసర ఇబ్బందులు కలగకుండా, అదే సమయంలో ఎన్నికల నిబంధనలు ఉల్లంఘనకు గురికాకుండా విధులు నిర్వర్తించాలని సూచించారు.

### సెక్యూరిటీ డిపాజిట్ విషయంలో నిబంధనలు పాటించాలి

ఒక అభ్యర్థి ఒకే వార్డులో ఒకటి కంటే ఎక్కువ నామినేషన్ పత్రాలు దాఖలు చేసిన సందర్భంలో, నిబంధనల ప్రకారం ఒకే సెక్యూరిటీ డిపాజిట్ సమర్పించడం సరిపోతుందని కలెక్టర్ వివరించారు. అయితే, అదే అభ్యర్థి వేర్వేరు వార్డుల నుంచి పోటీ చేసేందుకు నామినేషన్లు దాఖలు చేసినట్లయితే, ప్రతి వార్డుకు విడివిడిగా నిర్ణీత సెక్యూరిటీ డిపాజిట్ సమర్పించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.ఈ అంశంపై అభ్యర్థులకు సరైన అవగాహన కల్పించాలని, నామినేషన్ పత్రాలు, డిపాజిట్ల స్వీకరణ విషయంలో ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలని సంబంధిత అధికారులకు సూచించారు.

### అధికారుల సందేహాల నివృత్తి - సమన్వయంతో విధుల నిర్వహణ

వీడియో కాన్ఫరెన్స్ సందర్భంగా రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల అధికారులు లేవనెత్తిన వివిధ సందేహాలను జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, జాయింట్ కలెక్టర్ సమీక్షించి తగిన సూచనలు, వివరణలు అందించారు. నామినేషన్ల స్వీకరణలో ఎదురయ్యే సందేహాలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని, వాటిపై స్పష్టత పొందిన అనంతరం సంబంధిత సిబ్బందికి కూడా సమాచారం అందించాలని సూచించారు.ఒక అధికారికి అందిన మార్గదర్శకాలు, సూచనలు ఇతర సంబంధిత ఎన్నికల అధికారులకు కూడా చేరేలా సమన్వయం చేసుకోవాలని, ఎన్నికల ప్రక్రియలో అందరూ ఒకే విధమైన అవగాహనతో పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. రేపు నామినేషన్ల స్వీకరణకు చివరి రోజు కావడంతో అన్ని కేంద్రాల్లో అవసరమైన సిబ్బంది, రికార్డులు, ఇతర ఏర్పాట్లను ముందుగానే సిద్ధం చేసుకోవాలని, నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను ప్రశాంతంగా, పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.




# విజయవాడలో అకట్టుకుంటున్న
# జాతీయ సరస్ మేళా

**దేశవ్యాప్తంగా 32 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి 1,500 మంది మహిళా పారిశ్రామికవేత్తల భాగస్వామ్యం**

**600 స్టాళ్లు, 50 లైవ్ ఫుడ్ స్టాళ్ల ఏర్పాటు ప్రతిరోజూ 40 వేల నుంచి 50 వేల మందికి పైగా సందర్శకుల రాక**

**ఇప్పటివరకు దాదాపు రూ. 2 కోట్లకు పైగా సేల్స్**

**ఎన్ఐఆర్డి అడిషనల్ డైరెక్టర్ సుధీర్ కుమార్**

**విజయవాడ,మనం బ్యూరో చీఫ్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామీణ జీవనోపాధి మిషన్ (సెర్ప్) సహకారంతో, భారత ప్రభుత్వ గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో విజయవాడలో తొలిసారిగా నిర్వహిస్తున్న జాతీయ సరస్ మేళా ప్రజలను విశేషంగా ఆకట్టుకుంటోందని ఎన్ఐఆర్డి అడిషనల్ డైరెక్టర్ సుధీర్ కుమార్ తెలిపారు.స్థానిక పున్నమి ఘాట్ లోని సరస్ ఎగ్జిబిషన్ ప్రాంగణం లో శనివారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశం లో ఎన్ఐఆర్డి అడిషనల్ డైరెక్టర్ సుధీర్ కుమార్ మాట్లాడుతూ... దేశవ్యాప్తంగా స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేసిన ఉత్పత్తులకు జాతీయ స్థాయి మార్కెటింగ్ వేదిక కల్పించడంతో పాటు, మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడం ఈ మేళా ప్రధాన ఉద్దేశం అన్నారు.జాతీయ సరస్ మేళాలో చేనేత, హస్తకళలు, సహజ ఆహార ఉత్పత్తుల విభాగాల్లో సుమారు 600 స్టాళ్లను ఏర్పాటు చేశారన్నారు. వివిధ రాష్ట్రాలకు చెందిన సంప్రదాయ వంటకాలను సందర్శకులకు అందించేందుకు 50 లైవ్ ఫుడ్ స్టాళ్లతో ప్రత్యేక ఫుడ్ కోర్టును అందుబాటులోకి తీసుకొచ్చారన్నారు. సుమారు 32 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన 1,500 మంది స్వయం సహాయక సంఘాల మహిళా పారిశ్రామికవేత్తలు తమ ఉత్పత్తులను ప్రదర్శిస్తూ ఉత్సాహంగా పాల్గొంటున్నారన్నారు. సందర్శకుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు మేళా ప్రాంగణంలో సందర్శకులు, కళాకారుల సౌకర్యార్థం వివిధ ప్రత్యేక పవిలియన్లను ఏర్పాటు చేశారన్నారు. గేట్ నంబర్ 2 వద్ద ఉన్న వెల్కమ్ పెవిలియన్లో హెల్ప్ డెస్క్, రిజిస్ట్రేషన్ కౌంటర్, లాస్ట్ అండ్ ఫౌండ్ కేంద్రాలను ఏర్పాటు చేసి అవసరమైన సమాచారాన్ని అందిస్తున్నారన్నారు .ప్రభుత్వంలోని వివిధ శాఖలు అమలు చేస్తున్న పథకాలను ప్రదర్శించడంతో పాటు, వాటిపై స్వయం సహాయక సంఘాల సభ్యులకు అవగాహన కల్పించేందుకు కన్వర్జెన్స్ పవిలియన్ను ఏర్పాటు చేశారన్నారు. ఈ వేదిక ద్వారా ప్రభుత్వ పథకాలు, మహిళా పారిశ్రామికవేత్తలకు అందుబాటులో ఉన్న అవకాశాలపై సమాచారం అందిస్తున్నారన్నారు. మహిళా పారిశ్రామికవేత్తలకు మార్కెటింగ్ నైపుణ్యాలపై శిక్షణ స్వయం సహాయక సంఘాల మహిళలు తమ ఉత్పత్తులను నాణ్యమైన బ్రాండ్లుగా అభివృద్ధి చేసుకొని జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లలో విక్రయించేలా ప్రోత్సహించేందుకు మీట్ అండ్ గ్రీట్ పవిలియన్లో ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. ఎన్ఐఆర్డిపిఆర్ నిపుణులు, జాతీయ స్థాయి నిపుణుల సహకారంతో ప్రతిరోజూ నిర్వహిస్తున్న ఈ శిక్షణలో బ్రాండింగ్, ప్యాకేజింగ్, ఎగుమతి మార్కెటింగ్, వాల్యూ చైన్ మేనేజ్మెంట్ వంటి అంశాలపై అవగాహన కల్పిస్తున్నారన్నారు.మహిళా పారిశ్రామికవేత్తల విజయగాథలు, వ్యాపార నైపుణ్యాలు, ఉత్పత్తుల ప్రత్యేకతలను ప్రజలకు పరిచయం చేసేందుకు లఖ్పతి దీదీ పవిలియన్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోందన్నారు. అలాగే మహిళలు తమ ఉత్పత్తులను స్వయంగా ఎలా తయారు చేస్తున్నారో ప్రత్యక్షంగా చూపించే డెమో పవిలియన్ సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటోందన్నారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిబింబంగా సరస్ మేళా వివిధ రాష్ట్రాల చేనేత వస్త్రాలు, హస్తకళలు, సహజ ఆహార ఉత్పత్తులతో పాటు సంప్రదాయ కళారూపాలు, ప్రాంతీయ వంటకాలు ఈ మేళాకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయన్నారు. దేశంలోని భిన్న సంస్కృతులు, సంప్రదాయాలను ఒకే వేదికపై పరిచయం చేస్తూ, గ్రామీణ మహిళల ఆర్థిక సాధికారతకు సరస్ మేళా దోహదపడుతోందన్నారు.ప్రతిరోజూ సుమారు 40 వేల నుంచి 50 వేల మందికి పైగా సందర్శకులు మేళాకు తరలివస్తుండటం విశేషం. మహిళా స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులకు విస్తృత ప్రచారం, మార్కెట్ అవకాశాలు కల్పించడంతో పాటు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో జాతీయ సరస్ మేళా కీలక పాత్ర పోషిస్తోందన్నారు.




సెర్ప్ అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ కళ్యాణ చక్రవర్తి మాట్లాడుతూ దేశ రాజధాని ఢిల్లీ తర్వాత తొలిసారిగా విజయవాడలో నిర్వహిస్తున్న జాతీయ సరస్ మేళాకు విశేష స్పం దన లభిస్తోందని తెలిపారు.మహిళా స్వయం సహాయక సంఘాలకు ఉచితంగా 600 స్టాళ్లు, ప్రయాణం, భోజనం, వసతి సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. దేశవ్యాప్తంగా మహిళా స్వయం సహాయక సంఘాలు తయారు చేస్తున్న ఉత్పత్తులకు విస్తృత మార్కెటింగ్ అవకాశాలు కల్పించడం, మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడం ఈ మేళా ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.జాతీయ సరస్ మేళాలో చేనేత, హస్తకళలు, ఆహార ఉత్పత్తుల విభాగాల్లో మొత్తం 600 స్టాళ్లను మహిళా సంఘాలు, కళాకారులకు ఉచితంగా కేటాయించినట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా 32 రాష్ట్రాల నుంచి వచ్చిన మహిళా స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు, కళాకారులకు ప్రయాణం, భోజనం, వసతి సౌకర్యాలను కూడా ఉచితంగా కల్పించినట్లు వివరించారు. తద్వారా గ్రామీణ మహిళలు తమ ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు విక్రయించడంతో పాటు, తమ వ్యాపారాన్ని విస్తరించుకునేందుకు ఈ మేళా దోహదపడుతోందన్నారు. మహిళా సాధికారతకు వేదికగా 'లఖ్పతి దీదీ' పెవిలియన్ మహిళా పారిశ్రామికవేత్తల ప్రతిభ, విజయాలను ప్రోత్సహించేందుకు ఏర్పాటు చేసిన 'లఖ్పతి దీదీ' పెవిలియన్ మేళాలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోందని కళ్యాణ చక్రవర్తి తెలిపారు. వివిధ రాష్ట్రాల సంప్రదాయ వంటకాలు, చేనేత వస్త్రాలు, హస్తకళలు, సహజ ఆహార ఉత్పత్తులు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయని పేర్కొన్నారు. దేశంలోని భిన్న ప్రాంతాల సంస్కృతులు, సంప్రదాయాలు, ఆహార వైవిధ్యాన్ని ఒకే వేదికపై పరిచయం చేస్తున్న ఈ మేళా 'మినీ ఇండియా'ను తలపిస్తోందన్నారు.దసరా పండుగ సందర్భంగా జాతీయ సరస్ మేళాకు సందర్శకుల నుంచి విశేష ఆదరణ లభిస్తోందని కళ్యాణ చక్రవర్తి తెలిపారు. మహిళా సంఘాలు తయారు చేసిన ఉత్పత్తులకు వినియోగదారుల నుంచి మంచి స్పందన లభిస్తోందని, ఇప్పటివరకు సుమారు రూ.2 కోట్ల మేర వ్యాపారం జరిగినట్లు వెల్లడించారు.గ్రామీణ మహిళలు తయారు చేసిన ఉత్పత్తులకు జాతీయ స్థాయిలో గుర్తింపు, మార్కెట్ అవకాశాలు కల్పించడంతో పాటు, వారి ఆదాయాన్ని పెంపొందించేందుకు జాతీయ సరస్ మేళా కీలక వేదికగా నిలుస్తోందని ఆయన పేర్కొన్నారు. మహిళా స్వయం సహాయక సంఘాలను విజయవంతమైన పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు.పాత్రికేయుల సమావేశం లో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్మెంట్ జాయింట్ డైరెక్టర్ ఖటారియా, ఎన్టీఆర్ జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ ఏ ఎన్వీ నాంచారరావు లు పాల్గొన్నారు.



## జనసేనకు మేయర్... తమ్ముళ్లకు ఫికర్
# కూటమిలో రచ్చ...టీడీపీ అసంతృప్తి

(పి. మీరా హుస్సేన్ ఖాన్, మనం బ్యూరో చీఫ్ ): కూటమి ఒప్పందంలో భాగంగా విజయవాడ, కాకినాడ కార్పొరేషన్లను జనసేన పార్టీకి కేటాయించారు. అయితే, విజయవాడలో దశాబ్దాలుగా పార్టీని నమ్ముకున్న టీడీపీ నేతలు ఈ నిర్ణయంతో షాక్కు గురయ్యారు. ముఖ్యంగా ఒక సామాజిక వర్గానికి చెందిన కీలక నేతలు మేయర్ సీటు చేజారడంపై అంతర్గతంగా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

### డివిజన్ల పంపకాల్లో ప్రతిష్టంభన

మొత్తం డివిజన్లు ఉన్న విజయవాడ కార్పొరేషన్లో సీట్ల పంపకం పెద్ద తలనొప్పిగా మారింది. మేయర్ పీఠం తమదే కాబట్టి బల నిరూపణ కోసం కనీసం 30 కి పైగా సీట్లు కావాలని జనసేన పట్టుబడుతోంది. క్షేత్రస్థాయిలో తమకు బలమైన క్యాడర్ ఉందని, జనసేనకు 17 నుండి 20 సీట్లు మాత్రమే ఇవ్వగలమని టీడీపీ నేతలు స్పష్టం చేస్తున్నారు. మరోవైపు బీజేపీ సైతం సుమారు 10 స్థానాలను ఆశిస్తుండటంతో త్రిముఖ సమరంలో సీట్ల సర్దుబాటు క్లిష్టంగా మారింది.

**ఆంధ్రప్రదేశ్లో మున్సిపల్ ఎన్నికల పర్వం ఊపందుకున్న వేళ, బెజవాడ రాజకీయాలు అత్యంత రసవత్తరంగా మారాయి. అధికార టీడీపీ-జనసేన-బీజేపీ కూటమిలో భాగంగా విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పీఠాన్ని జనసేనకు కేటాయించడం, సీట్ల పంపకాలపై ప్రతిష్టంభన ఏర్పడటంతో క్షేత్రస్థాయిలో తీవ్ర చర్చ నడుస్తోంది.**

### వంగవీటి రాధా ఎంట్రీతో మారిన సమీకరణాలు

ఈ రచ్చ మధ్యే వంగవీటి రాధాకృష్ణ జనసేనలో చేరి విజయవాడ మేయర్ అభ్యర్థిగా రేసులోకి రావడం సంచలనం సృష్టించింది. కాపు సామాజిక వర్గం మరియు వంగవీటి రంగ అనుచరుల ఓట్లను గంపగుత్తగా రాబట్టేందుకు పవన్ కళ్యాణ్ వేసిన ఈ వ్యూహం, టీడీపీలోని ఆశావహుల ఆశలపై నీళ్లు చల్లింది. టీడీపీ తరపున మేయర్ పదవి ఆశించిన గద్దె అనూరాధ, బొండా సిద్ధార్థ్, దేవినేని అపర్ణ వంటి నేతల అనుచరులు ఇప్పుడు డివిజన్ సీట్ల కోసమైనా గట్టిగా పట్టుబట్టాలని ఒత్తిడి తెస్తున్నారు.

### వైసీపీ 'వెయిట్ అండ్ వాచ్'

కూటమిలో జరుగుతున్న ఈ సీట్ల రచ్చను ప్రతిపక్ష వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నిశితంగా గమనిస్తోంది. కూటమిలో అసమ్మతి నేతలను తమ వైపు తిప్పుకోవడంతో పాటు, వరద నిర్వహణలో లోపాలు మరియు ప్రభుత్వ వ్యతిరేక ఓటు బ్యాంకును నమ్ముకుని బెజవాడ పీఠాన్ని మళ్లీ దక్కించుకోవాలని వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వ్యూహాలు రచిస్తున్నారు.



## దుర్గమ్మ వారికి సారె సమర్పించిన పెనుగంచిప్రోలు దేవస్థానం అధికారులు



**విజయవాడ,అక్టోబర్,17,(మనం న్యూస్ ):** దసరా శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఇంద్రకీలాద్రి క్షేత్రానికి పెనుగంచిప్రోలు దేవస్థానం ఆలయ అధికారులు పాలకమండలి శనివారం మధ్యాహ్నం సారెను సమర్పించారు. ఈ సందర్భంగా దేవస్థాన అధికారులు పెనుగంచిప్రోలు దేవస్థానం అధికారులకు పాలకమండలి సభ్యులకు స్వాగతం పలికారు. అమ్మవారికి సారి సమర్పించిన అనంతరం వేద పండితులు పెనుగంచిప్రోలు దేవస్థానం అధికారులకు పాలకమండలి వారికి వేద ఆశీస్సులు అందజేయగా ఆలయ చైర్మన్ బొర్రా రాధాకృష్ణ ( గాంధీ,) వారికి అమ్మవారి చిత్రపటాన్ని ప్రసాదాలు అందజేశారు.

## విపిఆర్ దంపతులను కలిసిన సుకుమార్ రెడ్డి





**నెల్లూరు: అక్టోబర్ 17 (మనం న్యూస్):** కావలి జనసేన పార్టీ నాయకులు మన్నెమాల సుకుమార్ రెడ్డి శనివారం నెల్లూరులోని విపిఆర్ దంపతులను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విపిఆర్ దంపతులను ఆయన ఘనంగా సన్మానించారు. అనంతరం జిల్లాలో తాజా రాజకీయాలపై కాసేపు చర్చించటం జరిగింది. ఈ సందర్భంగా జనసేన పార్టీలో చేరిన సుకుమార్ రెడ్డికి విపిఆర్ దంపతులు శుభాకాంక్షలు తెలిపారు. అందరము కూటమి నేతలు కలిసి స్థానిక సంస్థల ఎన్నికల్లో అద్భుత విజయాలు సాధించాలని సుకుమార్ రెడ్డిని కోరారు. ఖచ్చితంగా స్థానిక సంస్థలు ఎన్నికల్లో కావలిలో జనసేన పార్టీ సత్తా చూపుతామని ఈ సందర్భంగా సుకుమార్ రెడ్డి అన్నారు.

## 7వ రోజు దసరా సేవల్లో 750 మంది జిల్లా ఎన్ఎస్ఎస్
# వాలంటీర్లు, 100 మంది యూత్ రెడ్ క్రాస్ వాలంటీర్లు





**విజయవాడ,అక్టోబర్,17,(మనం న్యూస్):** ఇంద్రకీలాద్రిపై శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలో జరుగుతున్న దసరా మహోత్సవాల్లో ఏడవ రోజు కూడా ఎన్టీఆర్ జిల్లా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, యూత్ రెడ్ క్రాస్ వాలంటీర్లు ఉత్సాహంగా సేవలందిస్తున్నారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశా, ఐఏఎస్ ఆదేశాల మేరకు 750 మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, 100 మంది యూత్ రెడ్ క్రాస్ వాలంటీర్లు భక్తులకు వివిధ రూపాల్లో సేవలందిస్తున్నారు. ప్రతిరోజూ మూడు షిఫ్టుల్లో విధులు నిర్వహిస్తున్న వాలంటీర్లు భక్తులకు తాగునీరు, మజ్జిగ, పాలు పంపిణీ చేయడంతో పాటు అన్నదాన కార్యక్రమంలో సహకరిస్తున్నారు. అదేవిధంగా వైద్య సేవలకు సహకరించడం, వృద్ధులు, దివ్యాంగులకు అవసరమైన సహాయం అందించడం, భక్తుల రద్దీని నియంత్రించడం వంటి సేవల్లో చురుకుగా పాల్గొంటున్నారు. రాత్రింబవళ్లు నిరంతరాయంగా సేవలందిస్తూ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తమ వంతు కృషి చేస్తున్నారు. దసరా సెలవులు ఉన్నప్పటికీ వ్యక్తిగత సెలవులను పక్కనపెట్టి, భక్తులకు సేవ చేయాలనే సంకల్పంతో యువతీ యువకులు గత ఏడు రోజులుగా సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. తమ శక్తి సామర్థ్యాలకు అనుగుణంగా భక్తులకు సహాయం అందిస్తూ సామాజిక బాధ్యతను చాటుకుంటున్నారు. వాలంటీర్ల సేవలపై భక్తుల నుంచి ప్రశంసలు లభిస్తున్నాయి. ఈ సందర్భంగా వాలంటీర్లు మాట్లాడుతూ, అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు సేవ చేయడం ఎంతో ఆనందాన్ని, ఆత్మతృప్తిని కలిగిస్తోందని తెలిపారు. ప్రజాసేవలో పాల్గొనే అవకాశాన్ని కల్పించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశాకు, వాలంటీర్ల సేవలను నిరంతరం పర్యవేక్షిస్తూ మార్గనిర్దేశం చేస్తున్న జిల్లా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ మరియు జిల్లా టూరిజం ఆఫీసర్ డాక్టర్ కొల్లేటి రమేష్కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. దసరా మహోత్సవాల సందర్భంగా యువత చేస్తున్న సేవలు సామాజిక బాధ్యతకు, సేవాభావానికి, మానవత్వానికి ప్రతీకగా నిలుస్తున్నాయి.

## అందుబాటులో ఎన్నికల సాధారణ పరిశీలకులు ఎస్.నాగలక్ష్మి

**విజయవాడ, అక్టోబర్,17,(మనం న్యూస్):** రెండో సాధారణ మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల ఎన్నికలకు సంబంధించి ఎన్టీఆర్ జిల్లాకు సాధారణ ఎన్నికల పరిశీలకులుగా నియమితులైన ఐఏఎస్ అధికారి, ఏపీ జెన్కో మేనేజింగ్ డైరెక్టర్ ఎస్ .నాగలక్ష్మి క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లు, నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను పరిశీలిస్తూ ఎన్నికల ప్రక్రియ సజావుగా, నిబంధనలకు అనుగుణంగా జరిగేలా పర్యవేక్షిస్తున్నారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, నిష్పాక్షికతకు ప్రాధాన్యతనిస్తూ, ఎన్నికల నియమావళి అమలుకు సంబంధించి ప్రజలు, అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ దృష్టికి తీసుకురావాల్సిన ఫిర్యాదులు లేదా సమస్యలు ఉంటే సాధారణ ఎన్నికల పరిశీలకురాలిని సంప్రదించవచ్చని తెలిపారు. ఈ మేరకు ఎన్నికల పరిశీలకురాలు నాగలక్ష్మికి ₹ఫోన్ నంబర్ 7680980032₹ ద్వారా లేదా ఝఛీబఇఛ్బుఛి౨2025జుఝ్బజీజూ.ఛౌఝ ఈ-మెయిల్ చిరునామాకు ఫిర్యాదులు, ఎన్నికలకు సంబంధించిన వివరాలను తెలియజేయవచ్చని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.



## జయరాజ్ ఫార్చ్యూన్ ప్యాకేజింగ్స్ పరిశ్రమను తనిఖీ చేసిన ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఛైర్మన్ పి. కృష్ణయ్య




**గుంటూరు జిల్లా, అక్టోబర్ :17 (మనం న్యూస్ ప్రతినిధి)** మేడికొండూరు మండలం,తక్కెళ్లపాడు గ్రామంలోని జయరాజ్ ఫార్చ్యూన్ ప్యాకేజింగ్స్ పరిశ్రమను తనిఖీ చేశారు.ఈ తనిఖీలో (ఏ పి పి సి బి) ప్రాంతీయ కార్యాలయం,గుంటూరు ప్రాంతీయ పర్యావరణ ఇంజినీర్ ఎం.డి. నజీనా బేగం, ప్రాంతీయ కార్యాలయ అధికారులు మరియు పరిశ్రమ ప్రతినిధులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఛైర్మన్ పరిశ్రమ ప్రాంగణాన్ని పరిశీలించి,ముడి పదార్థాల వినియోగం, తయారీ ప్రక్రియకు సంబంధించిన కార్యకలాపాలను సమీక్షించారు.అనంతరం పరిశ్రమలో ఏర్పాటు చేసిన బాయిలర్ నిర్వహణ, వాయు కాలుష్య నియంత్రణ వ్యవస్థలు, ఘన వ్యర్థాల నిర్వహణ పద్ధతులను పరిశీలించారు.ఈ సందర్భంగా ప్రాంతీయ పర్యావరణ ఇంజినీర్ ఎం.డి. నజీనా బేగం, పరిశ్రమలో అమలవుతున్న తయారీ ప్రక్రియలు,కాలుష్య నియంత్రణ పరికరాల పనితీరు,పర్యావరణ పరిరక్షణకు సంబంధించి అనుసరిస్తున్న చర్యల గురించి ఛైర్మన్ కి వివరించారు.ఛైర్మన్ సంబంధిత అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి,పరిశ్రమ కార్యకలాపాలు వర్తించే పర్యావరణ ప్రమాణాలు మరియు కాలుష్య నియంత్రణ నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా అనే అంశాలను సమీక్షించారు.

## ఆవిష్కార్ మంథాన్లో వివిఐటియూ విద్యార్థుల ప్రతిభ



**గుంటూరు నంబూరు అక్టోబర్ :17 (మనం న్యూస్ ప్రతినిధి)** కర్ణాటక రాష్ట్రంలోని మల్నాడ్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్లో దేశవ్యాప్తంగా ఉన్న సాంకేతిక విద్యార్థులకు నిర్దిష్ట సమస్యలకు సరికొత్త, వినూత్న పరిష్కారాలను కనుగొనేందుకు నిర్వహించిన ఆవిష్కార్ మంథాన్ ఐడియాథాన్ పోటీలలో వివిఐటియూ విద్యార్థులు రూపొందించిన 'వేస్ట్ ఫుడ్ మేనేజ్మెంట్' ప్రాజెక్టుకు మొదటి బహుమతి లభించిందని, అలాగే ఎలక్యూషన్ ఈవెంట్లో ప్రత్యేక గుర్తింపు లభించిందని వివిఐటియూ ప్రో-ఛాన్సలర్ వాసిరెడ్డి మహాదేవ్ తెలిపారు. దేశవ్యాప్తంగా 22 బృందాలు ఈ పోటీలలో పాల్గొనగా, వివిఐటి విశ్వవిద్యాలయ ఐయూసిఈఈ విద్యార్థి విభాగానికి చెందిన బి. అభిషేక్, పవన్, బొగేష్ మణికంఠల బృందం రూపొందించిన యాప్కు తొలి బహుమతి దక్కిందని వివరించారు. శుభకార్యాలు, హోటళ్లలో మిగిలిపోయిన ఆహారం వృథా కాకుండా ఇతరులకు చేరే విధంగా ఈ యాప్ను తీర్చిదిద్దినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విజేతలను ఛాన్సలర్ వాసిరెడ్డి విద్యాసాగర్,రిజిస్ట్రార్ డా. వై. మల్లికార్జున రెడ్డి, అకడమిక్ డీన్ డా. కె.గిరిబాబు, టీచింగ్ లెర్నింగ్ సెంటర్ హెడ్ డా. రావెల నవీన్,ఫ్యాకల్టీ కోఆర్డినేటర్లు గీతాలలిత, రాజేంద్ర అభినందించారు.

## శరన్నవరాత్రి ఉత్సవాల్లో సాంస్కృతిక శోభ





**అలరించినహరిప్రియ**

**నృత్యాభినయం**

**విజయవాడ, అక్టోబర్ 17,(మనం న్యూస్):** ఇంద్రకీలాద్రిపై వైభవంగా నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా కొండ దిగువన శ్రీ కనకదుర్గా నగర్ లోని కళావేదిక పై వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సంగీత , నృత్య కళాకారులు తమ ప్రదర్శనలతో, ఆధ్యాత్మిక శోభతో భక్తులను ఆకట్టుకునేలా చేశారు. అనేక రూపాలంకారాలతో జగన్మాత శ్రీ కనకదుర్గమ్మ భక్తులకు దర్శనమిస్తున్న తరుణంలో, కళాకారుల గానాలు, నృత్యాలు, భజన కీర్తనలు భక్తులను భక్తిభావంతో పరవశింప జేస్తున్నాయి. దసరా సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా అమ్మవారి వైభవాన్ని, దైవ భక్తిని ప్రతిబింబించేలా తిరుపతికి చెందిన భరత నాట్య కళాకారిణి హరిప్రియ నృత్యాభినయం భక్తులను, ప్రేక్షకులను, విశేషంగా ఆకర్షించింది. ఉమా మహేశ్వరి, శైలసుతే శివసహితే, పరిపాహి శ్రీ చాముండేశ్వరి దేవి₹ వంటి భక్తిరస ప్రధానమైన కీర్తనలకు భావ యుక్తమైన అభినయాన్ని జోడించి, భరత నాట్యం లోని నృత్య, అభినయ విశిష్టతలను కుమారి హరిప్రియ చక్కగా ఆవిష్కరించారు. శాస్త్రీయ నృత్య సంప్రదాయాన్ని భక్తితో మేళవిస్తూ సాగిన ఈ ప్రదర్శన దసరా ఉత్సవాల్లో ప్రత్యేకతను సంతరించుకుంది. కార్యక్రమం అనంతరం వివిధ ప్రదర్శనలతో భక్తులను ఆకట్టుకున్న కళాకారులను ఆలయ అధికారులు తీర్థ ప్రసాదాలతో పాటు ప్రశంసా పత్రాలను కూడా అందించి సత్కరించారు.

## పెదకాకాని పూల దుకాణం వద్ద మహిళపై లైంగిక దాడికి యత్నం,దాడి చేసి నగదు అపహరణ కేసులో నిందితుడి అరెస్ట్



**గుంటూరు పెదకాకాని అక్టోబర్: 17** (మనం న్యూస్ ప్రతినిధి) పూల దుకాణం వద్ద మహిళపై లైంగిక దాడికి యత్నం,దాడి చేసి నగదు అపహరణ కేసులో నిందితుడి అరెస్ట్ పెదకాకాని పోలీస్ స్టేషన్ పరిధిలోని పెదకాకాని సెంటర్లో గల బిస్మిల్లా పూల దుకాణం వద్ద గుర్తుతెలియని మహిళపై లైంగిక దాడికి యత్నించి,ఆమెపై దాడి చేసి నగదు అపహరించిన ఘటనకు సంబంధించి పెదకాకాని పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి, న్యాయస్థానం ముందు హాజరుపరిచి జ్యుడీషియల్ కస్టడీకి పంపించారు. కేసు వివరాలు:పెదకాకాని గ్రామానికి చెందిన షేక్ ఇమ్రాన్, వయస్సు 38 సంవత్సరాలు, గత 10 సంవత్సరాలుగా పెదకాకాని సెంటర్లో బిస్మిల్లా పూల దుకాణం నిర్వహిస్తున్నారు.ఈ క్రమంలో 10.10.2026 తేదీ ఉదయం సుమారు 07.00 గంటలకు తన దుకాణాన్ని పరిశీలించగా,దుకాణం వద్ద జరిగిన ఘటనకు సంబంధించిన సీసీటీవీ దృశ్యాలను పరిశీలించారు. అందులో 09.10.2026 తేదీ అర్ధరాత్రి సుమారు 00.27 గంటల సమయంలో 35-40 సంవత్సరాల వయస్సు గల గుర్తుతెలియని మహిళపై ఒక వ్యక్తి లైంగిక దాడికి యత్నించినట్లు గుర్తించారు. సదరు మహిళ ప్రతిఘటించి కేకలు వేయడంతో, నిందితుడు ఆమె ముఖంపై గుద్ది, కాలితో తన్ని, ఆమె వద్ద ఉన్న రూ.1,000/- నగదును బలవంతంగా తీసుకొని అక్కడి నుంచి పారిపోయినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. సీసీటీవీ దృశ్యాల్లో కనిపించిన వ్యక్తి శారీరక లక్షణాల ఆధారంగా ఫిర్యాదుదారుడు అనుమానం వ్యక్తం చేయడంతో, ఈ ఘటనపై పెదకాకాని పోలీస్ స్టేషన్లో క్రైమ్ నంబర్ 603/2026, సెక్షన్లు 115(2), 64 ట/రీ 62, 307 ఆూఖి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడి అరెస్ట్:ఈ కేసులో దర్యాప్తు కొనసాగించిన పెదకాకాని పోలీసులు,నిందితుడు దానబోయిన సాంబశివరావును 17.10.2026 తేదీన అరెస్ట్ చేసి, న్యాయస్థానంలో హాజరుపరిచి జ్యుడీషియల్ కస్టడీకి పంపించారు. మహిళలపై జరిగే నేరాల పట్ల పోలీసులు తీవ్రంగా స్పందిస్తారని,ఇటువంటి ఘటనలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటారని టి.పి. నారాయణ స్వామి,ఇన్స్పెక్టర్ ఒఫ్ పోలీసు,పెదకాకాని పిఎస్ ఈ సందర్భంగా తెలియజేశారు.

## స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక గ్రామాలలో  విస్తృతంగా కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లు

- **అనుమానాస్పద వ్యక్తులు, ప్రదేశాలు, వాహనాలపై ప్రత్యేక తనిఖీలు.**
- **ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడమే లక్ష్యం**

**గుంటూరు, అక్టోబర్ 16: (మనం న్యూస్ ప్రతినిధి)** స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా,స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించడంతోపాటు నేరాలను నియంత్రించడం, అసాంఘిక కార్యకలాపాలను అరికట్టడమే లక్ష్యంగా గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్,ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లాలో ముట్లూరు గ్రామంలో  విస్తృతంగా కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లు నిర్వహించారు. సౌత్ సబ్ డివిజన్ డీస్పీ జి పూర్ణచంద్రరావు పర్యవేక్షణలో సీఐ వట్టిచెరుకూరు, సిఐ పత్తిపాడు,ఎస్సై పత్తిపాడు, ఎస్సై పదినందిపాడు,ఎస్సై కాకుమాను,సివిల్ పోలీసు సిబ్బంది,స్పెషల్ టాస్క్ ఫోర్స్ (ఎస్ టి ఎఫ్) 25  సిబ్బంది సమన్వయంతో ఈ తనిఖీలు చేపట్టారు.అనుమానాస్పద వ్యక్తులు,వాహనాలు, పరిసరాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి, సరైన పత్రాలు లేని 23 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.గుంటూరు జిల్లా లోని వట్టిచెరుకూరు  పోలీస్ స్టేషన్ పరిధిలోని ముట్లూరు గ్రామంలో సౌత్ డీఎస్పీ శ్రీ జి  పూర్ణచంద్రరావు  గారి పర్యవేక్షణలో ఉదయం 5 గంటల నుంచి 6.30 గంటల వరకు కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. సరైన వాహన పత్రాలు లేని 23 ద్విచక్ర వాహనాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఎన్నికల నేపథ్యంలో పోలీసుల ప్రత్యేక నిఘా.స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా సమస్యాత్మక గ్రామాలు లో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీసు శాఖ ప్రత్యేక నిఘా కొనసాగిస్తోంది.అక్రమ మద్యం నిల్వ, రవాణా,పంపిణీకి పాల్పడే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటారు.  రౌడీషీటర్లను బైండోవర్ చేయడంతోపాటు సీసీ కెమెరాల ద్వారా నిఘా, ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ ఎన్నికల సమయంలో ఎలాంటి ఘర్షణలు చోటుచేసుకోకుండా చర్యలు చేపడుతున్నారు. ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా,నిర్భయంగా వినియోగించుకునేలా ప్రశాంత వాతావరణాన్ని కల్పించడం పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని అధికారులు తెలిపారు. రాజకీయ అభిప్రాయాలు వేరుగా ఉన్నప్పటికీ పరస్పరం గౌరవించుకోవాలని,వ్యక్తిగత కక్షలు,పాత వివాదాలను ఎన్నికలతో ముడిపెట్టి ఘర్షణలకు దిగకూడదని సూచించారు.ఇతరులను బెదిరించడం, ప్రలోభాలకు గురిచేయడం, రెచ్చగొట్టడం,చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడటం వంటి చర్యలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. అక్రమ ఆయుధాల కదలికలు, అనుమానాస్పద వ్యక్తులు, నేరాలు లేదా అసాంఘిక కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలను కోరారు.నేర నియంత్రణకు నిరంతర చర్యలు.గుంటూరు జిల్లా వ్యాప్తంగా నేర నియంత్రణ,అసాంఘిక కార్యకలాపాల కట్టడి, మాదకద్రవ్యాల అక్రమ రవాణా నివారణ, ప్రజల భద్రతను బలోపేతం చేయడానికి ప్రత్యేక నిఘా, వాహన తనిఖీలు, కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లు నిరంతరం కొనసాగుతాయని జిల్లా పోలీసు అధికారులు తెలిపారు.ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా పోలీసులకు సహకరించాలని,స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంతంగా,స్వేచ్ఛ యుతంగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు.



# ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే క్రమశిక్షణా చర్యలు తప్పవు

- శిక్షణా తరగతులకు గైర్హాజరైన ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు జారీ
- జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ



**గుంటూరు, అక్టోబర్ 17: (మనం న్యూస్ ప్రతినిధి):** స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో అధికారులు పూర్తి బాధ్యతతో,అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ ఆదేశించారు.ఎన్నికల విధుల్లో ఎలాంటి నిర్లక్ష్యం,అలసత్వం వహించినా ఉపేక్షించేది లేదని, నిబంధనల ప్రకారం క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.శనివారం గుంటూరు జిల్లా కలెక్టరేట్లో స్థానిక సంస్థల ఎన్నికల రిటర్నింగ్ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జాయింట్ కలెక్టర్ మాట్లాడారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి అధికారులకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా పూర్తి చేయాలని సూచించారు. శిక్షణకు గైర్హాజరైతే చర్యలు తప్పవు.ఎన్నికల విధుల నిర్వహణకు సంబంధించి ప్రిసైడింగ్ అధికారులు,అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు తప్పనిసరిగా శిక్షణ తరగతులకు హాజరుకావాలని జాయింట్ కలెక్టర్ స్పష్టం చేశారు.ఎన్నికల విధులపై పూర్తి అవగాహన కలిగి ఉండటం ద్వారా పోలింగ్ ప్రక్రియను సజావుగా నిర్వహించవచ్చని తెలిపారు. సరైన కారణం లేకుండా శిక్షణ తరగతులకు గైర్హాజరయ్యే పీఓలు,ఏపీఓలపై నిబంధనల మేరకు క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఎన్నికల విధుల్లో అలసత్వానికి తావివ్వకూడదు.ఎన్నికల నిర్వహణలో ప్రతి అధికారి తనకు అప్పగించిన బాధ్యతలను అత్యంత జాగ్రత్తగా నిర్వర్తించాలని సూచించారు.ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లు, విధుల నిర్వహణ,సమన్వయం వంటి అంశాల్లో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.రోజువారీ నివేదికలను తప్పనిసరిగా పంపాలి.ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఆయా అధికారులు ప్రతిరోజూ నివేదికలను క్రమం తప్పకుండా పంపించాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు.నివేదికల సమర్పణలో జాప్యం జరగకుండా చూసుకోవాలని, ఎన్నికల ప్రక్రియలోని ప్రతి అంశంపై అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి, ఎన్నికల రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.

# ఎలక్ట్రానిక్ మీడియా ప్రకటనలకు ముందస్తు అనుమతి పొందాలి



**గుంటూరు, అక్టోబర్ 17 : (మనం న్యూస్ ప్రతినిధి)** పోటీలో ఉన్న అభ్యర్థులు ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రకటనలకు ముందస్తు అనుమతి పొందాలని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి సి.యం.సాయికాంత్ వర్మ తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. వివిధ చానల్స్, కేబుల్ చానెల్, సినిమా హాల్ తదితర ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రకటనలకు సంబంధించి అభ్యర్థులు మీడియా సర్టిఫికేషన్ మరియు మీడియా మానిటరింగ్ (ఎం.సి.ఎం.సి) టీమ్ కు కనీసం మూడు రోజులు ముందుగా చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుతో పాటు ప్రకటన ఇవ్వదలిచిన విషయంగల వీడియో, అందులోని అంశాలకు సంబంధించిన స్క్రిప్ట్,సమయం,తయారీ ఖర్చు, ఏ మీడియాలో ప్రసారం చేస్తున్నారు, అందుకు జరిగే వ్యయం తదితర అంశాలను సమర్పించాలని చెప్పారు. ప్రసారం చేసే వీడియోలో ఎన్నికల ప్రవర్తన నియమావళికి అనుగుణంగా మాత్రమే ఉండాలని అన్నారు. ప్రవర్తనా నియమావళికి అనుగుణంగా లేని ప్రకటనలకు అనుమతులు జారీ ఉండదన్నారు. ప్రింట్ మీడియా, సోషల్ మీడియాలో ప్రకటనలకు ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ఖర్చులు అభ్యర్థుల ఖాతాలో జమ చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఎం.సి.ఎం.సి టీమ్ పెయిడ్ న్యూస్ ను కూడా పర్యవేక్షణ చేయడం జరుగుతుందని చెప్పారు. సోషల్ మీడియాలో వచ్చే విషయాలను సైతం పూర్తి స్థాయిలో పర్యవేక్షణ చేయడం జరుగుతుందని తెలిపారు. ఎస్.ఎం.ఎస్ రూపంలో ఇచ్చే మెసేజ్ లకు,వాయిస్ మెసేజ్ లకు కూడా అనుమతులు తప్పనిసరి అని పేర్కొన్నారు. పోలింగ్ ముందు రోజు ఇచ్చే ప్రింట్ మీడియా ప్రకటనలకు కూడా అనుమతులు తప్పనిసరి అన్నారు.ప్రతి ఒక్కరూ ఎన్నికల ప్రవర్తన నియమావళి పాటించాలని కోరారు. పోస్టర్లు, కరపత్రాలు ముద్రిస్తే వాటి సంఖ్య, ఖర్చు, ఎన్నికల ప్రవర్తన నియమావళికి అనుగుణంగా మాత్రమే ముద్రించినట్లు ధృవీకరణ పత్రాన్ని సమర్పించాలని స్పష్టం చేశారు.

# కొర్నిపాడు పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేసిన జె.సి



**గుంటూరు, అక్టోబర్ 17 : (మనం న్యూస్ ప్రతినిధి)** వట్టిచెరుకూరు మండలం కొర్నిపాడు పోలింగ్ కేంద్రాన్నిజాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ శనివారం తనిఖీ చేశారు.జిల్లాలో ప్రశాంతంగా,సజావుగా ఎన్నికల నిర్వహణకు చర్యలు చేపడుతున్నామని జాయింట్ కలెక్టర్ చెప్పారు. ఇందులో భాగంగా సున్నిత,అతి సున్నిత పోలింగ్ కేంద్రాలను, సమస్యాత్మక కేంద్రాలను కూడా గుర్తించడం జరుగుతుందని అన్నారు.ప్రజలందరూ శాంతియుత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సమస్యలు ఉంటే ముందే జిల్లా ఎన్నికల యంత్రాంగానికి తెలియజేయాలని తద్వారా వాటిని తక్షణం పరిష్కరించుటకు చర్యలు చేపడతామని తెలిపారు. చక్కని వాతావరణంలో ప్రశాంతంగా ఎన్నికలు జరిగి ఆదర్శ ఆదర్శవంతంగా జిల్లా నిలవాలని అన్నారు.ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలను గుర్తించినా, ఎన్నికలకు సంబంధించి ఏవైనా సందేహాలు లేదా ప్రశ్నలు ఉన్నా,వాటిపై ఫిర్యాదులు చేసేందుకు లేదా వివరాలు తెలుసుకునేందుకు 08632 234014 హెల్ప్‌డెస్క్/కాల్ సెంటర్ ఫోన్ నంబర్ను సంప్రదించవచ్చని వివరించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ప్రాథమిక సౌకర్యాలు ఉండాలని మండల అధికారులను ఆదేశించారు. విద్యుత్తు,సీసీ కెమెరాలు, వెబ్ కాస్టింగ్ తదితర అంశాలపట్ల స్పష్టమైన అవగాహన ఉండాలని చెప్పారు.వార్డుల వారీగా పోలింగ్ బూతులు ఏర్పాటు పక్కాగా ఉండాలని సూచించారు.ఎన్నికల నిర్వహణకు వచ్చే సిబ్బందికి సమస్యలు లేకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణ పట్ల ఎక్కడా నిర్లక్ష్యం వహించరాదని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.శంకర్, మండల అధికారులు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికల నిర్వహణను అత్యంత పటిష్టంగా, పారదర్శకంగా చేపట్టాలి

**గుంటూరు అక్టోబర్ : 17 (మనం న్యూస్ ప్రతినిధి )**నగరపాలక సంస్థ స్థానిక ఎన్నికల నిర్వహణను అత్యంత పటిష్టంగా, పారదర్శకంగా చేపట్టేందుకు అవసరమైన ముందస్తు చర్యలను వేగవంతం చేయాలని నగర కమిషనర్, అడిషనల్ ఎలక్షన్ అధారిటీ కె.మయూర్ అశోక్ అధికారులను ఆదేశించారు. శనివారం కమిషనర్ స్థానిక ఆంధ్రాముస్లిం కాలేజిని డిస్ట్రిబ్యూషన్ సెంటర్ కోసం, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజి ప్రాంగణాన్ని కౌంటింగ్ సెంటర్ల కోసం పరిశీలించితీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ,గుంటూరు నగరపాలక సంస్థలో 76 వార్డ్ లకు సంబంధించి 596 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల నిర్వహణకు రిటర్నింగ్ అధికారుల వారీగా ఎన్నికల సామాగ్రి సక్రమంగా ఇబ్బందులు లేకుండా అందించేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు.డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుండి సామాగ్రి తరలించడానికి వచ్చే బస్ లకు సరైన మార్గం ఉండేలా,సిబ్బందికి భోజనం సదుపాయం పక్కాగా చేపట్టాలని ఇంజినీరింగ్,పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు.అలాగే ఎన్నికల అనంతరం బ్యాలెట్ బాక్స్ లు భద్రపరచడం,తదుపరి కౌంటింగ్ చేయడానికి తగిన బ్యారీ కేడింగ్,ఇతర ఏర్పాట్లు చేయాలన్నారు. టౌన్ సర్వేయర్లతో సమన్వయం చేసుకుంటూ సిటి ప్లానర్ డిస్ట్రిబ్యూషన్ సెంటర్, కౌంటింగ్ సెంటర్లకు సంబందించి సమగ్ర మ్యాప్ సిద్దం చేయాలని ఆదేశించారు. ఎన్నికల నిర్వహణలో అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో వ్యవహరించి ఏర్పాట్లను వేగవంతం చేయాలన్నారు.పర్యటనలో ఆర్డీఓ శ్రీనివాసరావు,జిల్లా పరిషత్ సిఈఓ జ్యోతిబసు, జిఎంసి అదనపు కమిషనర్ ఐ.కిషోర్,డిప్యూటి కమిషనర్ బి.శ్రీనివాసరావు,ఎస్ఈ జి.వెంకటేశ్వరరావు,సిటి ప్లానర్ డి.రాంబాబు,సర్వేయర్లు లక్ష్మీనారయణ,సుభాని పాల్గొన్నారు.



# బొమ్ములూరు1947 ఐ.ఎన్.సి లో భక్తి శోభ

- లక్ష రూపాయల 500 కొత్త నోట్లతో అమ్మవారి అలంకరణ
- కానుమోలు ఆయుర్వేద వైశ్యశాల డాక్టర్ వాహిని ఆధ్వర్యంలో వైద్య శిబిరం



**హనుమాన్ జంక్షన్, అక్టోబర్ 16: ( మనం న్యూస్ ):** హనుమాన్ జంక్షన్-ఏలూరు ప్రధాన జాతీయ రహదారి ప్రక్కన బొమ్ములూరులోని 1947 ఐ.ఎన్.సి లెదర్ ఇండస్ట్రీలో విశ్వహిందూ పరిషత్ నేషనల్ ట్రస్టీ పుట్టగుంట సతీష్ కుమార్ ఆధ్వర్యంలో దసరా నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. వ రోజు సందర్భంగా అమ్మవారు లక్ష రూపాయల విలువైన 500 రూపాయల కొత్త నోట్లతో లక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా పుట్టగుంట సతీష్ కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. గత 18 సంవత్సరాలుగా భవానీ భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. సుదూర ప్రాంతాల నుంచి విజయవాడ కనకదుర్గమ్మ దర్శనానికి వెళ్లే భక్తులకు ఇక్కడ 24 గంటల పాటు వసతి సౌకర్యాలు అన్నప్రసాద వితరణ కల్పిస్తున్నారు. భవానీ భక్తుల సౌకర్యార్థం శనివారం కానుమోలు ఆయుర్వేద హాస్పటల్ డాక్టర్ కె వాహిని ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని తెలుగు రైతు నియోజకవర్గ అధ్యక్షుడు చింతల వెంకట శివ అప్పారావు, శ్రీ అభయాంజనేయ స్వామి దేవస్థానం చైర్మన్ వేమూరి శ్రీనివాసరావు ప్రారంభించారు.విలువైన ఉపయోగకరమైన మందులను డాక్టర్ వాహినీ ఆధ్వర్యంలో డాక్టర్ పుట్టగుంట సతీష్ కుమార్ భవానీ భక్తులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో వేగిరెడ్డి బాలాజి,వేగిరెడ్డినాని, వేగిరెడ్డి సాయి,నందిగం స్వామి,సీనియర్ జర్నలిస్టు లు తాడి రంగారావు,మేడేపూడి రాజా, అక్కినేని ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.

# బాపులపాడు ఎంపిపి రేసులో పెరికీడు మాజీ ఎంపిటిసి ప్రత్తిపాటి ప్రమీలారాణి



**హనుమాన్ జంక్షన్: అక్టోబర్ 17 ( మనం న్యూస్ ):** బాపులపాడు మండలం ఎం పి పి పదవిని తెలుగుదేశం పార్టీ నాయకురాలు ప్రత్తిపాటి ప్రమీలారాణి ఆశిస్తున్నారు. ఈ మేరకు గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ దృష్టికి ఈ విషయం తెలియజేశారు. గతంలో బాపులపాడు మండలం పెరికీడు ఎం పి టి సి గా పనిచేసి మంచిపేరు తెచ్చుకున్న ప్రమీలారాణి 1995 వ సంవత్సరం లో పెరికీడు గ్రామ పంచాయతీ సర్పంచిగా పోటీచేసి స్వల్ప తేడాతో ఓటమి చెందారు. అనాటి నుండి ప్రజాసేవలో మమేకమై తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్నారు. మండలం ఎస్ సి లకు కేటాయించటం దానికి అనుగుణంగా పెరికీడు ఎం పి టి సి స్థానం ఎస్ సి మహిళకు కేటాయించటం మార్గం సుగమం అయ్యే అవకాశం ఉంది.

# పోలింగ్ విధులపై పూర్తి అవగాహనతో బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలి



- **జిల్లా కలెక్టర్ సి యం. సాయికాంత్ వర్మ**

**గుంటూరు, అక్టోబర్ 17 (మనం న్యూస్ ప్రతినిధి):** స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పోలింగ్ సిబ్బంది పూర్తి స్థాయిలో శిక్షణ పొందాలని జిల్లా కలెక్టర్ సి యం. సాయికాంత్ వర్మ సూచించారు. శనివారం గుంటూరు నగరంలోని ఏసీ కాలేజీలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ను జిల్లా కలెక్టర్ పరిశీలించి,సిబ్బందికి పలు సూచనలు,ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ప్రభుత్వ మహిళా కళాశాలలో జరుగుతున్న పోలింగ్ సిబ్బంది శిక్షణా తరగతులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ,పోలింగ్ విధులకు సంబంధించి సిబ్బంది తమ సందేహాలను శిక్షణ సమయంలోనే నివృత్తి చేసుకోవాలని సూచించారు. సంబంధిత ఎన్నికల మెటీరియల్ను క్షుణ్ణంగా చదివి, పూర్తిగా అర్థం చేసుకున్న తర్వాతే విధులు నిర్వహించాలని తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి అశ్రద్ధకు తావులేకుండా, నిబంధనలను పాటిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ మయూర్ అశోక్, ఇతర అధికారులు ఉన్నారు.

# కార్యకర్తలకు సముచిత గౌరవం

- **ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి సమక్షంలో టీడీపీలోకి భారీ చేరికలు**
- **ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి**



**కావలి: అక్టోబర్ 17 (మనం న్యూస్):** తెలుగుదేశం పార్టీ చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాలు, నియోజకవర్గ అభివృద్ధికి ఆకర్షితులై పార్టీలో చేరికలు జోరందుకున్నాయి. అల్లూరు మండలం పురిణి గ్రామానికి చెందిన ప్రముఖ నాయకుడు పసుపులేటి సుధాకర్ ఆధ్వర్యంలో సుమారు 30 కుటుంబాలు శనివారం తెలుగుదేశం పార్టీలో చేరాయి. కావలి పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో స్థానిక శాసనసభ్యులు కావ్య క్రిష్ణ రెడ్డి సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి స్వయంగా పసుపు కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి మాట్లాడుతూ కావలి నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే తమ ఏకైక లక్ష్యమని స్పష్టం చేశారు. పార్టీని నమ్ముకుని నిరంతరం శ్రమించే ప్రతి కార్యకర్తనూ కంటికి రెప్పలా కాపాడుకుంటామని, కష్టపడే ప్రతి ఒక్కరికీ పార్టీలో సముచిత గౌరవం, సముచిత స్థానం లభిస్తుందని భరోసా ఇచ్చారు. నియోజకవర్గంలో అన్ని వర్గాల ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం అందుబాటులో ఉంటామని పేర్కొన్నారు. పార్టీలో చేరిన పసుపులేటి సుధాకర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి పనితీరు, నాయకత్వంపై నమ్మకంతోనే తామంతా పార్టీలో చేరామని, రాబోయే రోజుల్లో పురిణి గ్రామంలో తెలుగుదేశం పార్టీ పటిష్టతకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో అల్లూరు మండలానికి చెందిన ముఖ్య టీడీపీ నాయకులు, పురిణి గ్రామ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజలు కాంగ్రెస్ పార్టీ వైపు మొగ్గుచూపుతున్నారు



- **నెల్లూరు జిల్లా ప్రజల కోసం కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్ష పాత్ర పోషిస్తుంది**
- **కిరణ్ కుమార్ రెడ్డి**

**నెల్లూరు, అక్టోబర్ 17 (మనం న్యూస్):** నెల్లూరు నగరంలోని ఇందిరా భవన్ లో మాజీ కేంద్ర మంత్రి కిల్లి కృపారాణి ఆధ్వర్యంలో నిర్వహించిన నెల్లూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ సమీక్షా సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు నారపరెడ్డి కిరణ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకుడు ముజీర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన 100 కుటుంబాలు పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి, సాదరంగా ఆహ్వానించిన మాజీ మంత్రి కిల్లి కృపారాణి, జిల్లా అధ్యక్షులు కిరణ్ కుమార్ రెడ్డి. రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీలో చేరికలు కొనసాగుతాయని ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కిరణ్ కుమార్ రెడ్డి ఈ సందర్భంగా మాజీ కేంద్ర మంత్రి కిల్లి కృపారాణి మాట్లాడుతూ.. అన్నీ వర్గాల ప్రజలు కాంగ్రెస్ పార్టీ వైపు చూస్తున్నారు అన్నారు.నెల్లూరు జిల్లాలో స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరడం ఖాయమన్నారు.కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసేందుకు అభ్యర్థులు పోటీ పడటం దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేందుకు శుభ సంకేతంగా భావిస్తున్నాం. కాంగ్రెస్ పార్టీ ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తుందన్నారు.దేశం కోసం ప్రాణాలు అర్పించిన కుటుంబం రాహుల్ గాంధీ కుటుంబం అన్నారు. నారపరెడ్డి కిరణ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ భారీ విజయం సాధిస్తుందని ఆశిస్తున్నాను అన్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ..ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షురాలు వైయస్ షర్మిలమ్మ ఆదేశాలతో స్థానిక సంస్థల ఎన్నికలకు అభ్యర్థులను ఎంపికకు విచ్చేసిన కిల్లి కృపారాణికి జిల్లా కాంగ్రెస్ పార్టీ తరపున స్వాగతం పలుకుతున్నాం అన్నారు. రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలు బిజెపి పార్టీకి కొమ్ము కాస్తున్నాయని ప్రజలు గ్రహించారన్నారు.రాష్ట్రంలో బిజెపి అంటే బాబు, జగన్, పవన్ లా తయారయ్యారన్నారు. రాష్ట్రంలో ఏ ఎన్నిక జరిగినా, ఈ మూడు పార్టీలు కుమక్కు రాజకీయాలు చేస్తున్నాయన్నారు. నెల్లూరు జిల్లాలో పెన్నా, సంగం బ్యారేజీలు, విక్రమ్ సింహపురి యూనివర్సిటీ, నెల్లూరు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మహానేత వైయస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ పార్టీ హయాంలోనే మొదలైనవి అన్నారు.బిజెపి చేస్తున్న ఓట్ల చోరీపై దేశంలోని యావత్తు యువత పోరాటం చేస్తుందన్నారు.కాంగ్రెస్ పార్టీ తరపున స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఉత్సాహం చూపుతున్న ఆశావాహులకు జిల్లా కాంగ్రెస్ పార్టీ సాదరంగా ఆహ్వానిస్తుందన్నారు.అధిష్టానం సూచనల మేరకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ప్రకటిస్తాం అన్నారు.నెల్లూరు మున్సిపాలిటీ తో పాటు, ఆత్మకూరు, బుచ్చి నగరపాలకలోని అన్నీ డివిజన్ లలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను దింపి పోటీకి సిద్ధం అవుతుందన్నారు.

# మేయర్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఎన్టీఆర్ జిల్లా ఎన్నికల పరిశీలకురాలు నాగలక్ష్మి ఐఏఎస్

**విజయవాడ,అక్టోబర్,17,(మనం న్యూస్):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు విజయవాడ నగరపాలక సంస్థలో రెండవ సాధారణ పురపాలక ఎన్నికలు-2026 నిర్వహణలో భాగంగా ఎన్టీఆర్ జిల్లా ఎన్నికల పరిశీలకురాలు నాగలక్ష్మి ఐఏఎస్ శనివారం ఉదయం విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని మేయర్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆధ్వర్యంలో జరిగిన ఈ పరిశీలనలో మేయర్ ఎన్నికలకు సంబంధించి కొనసాగుతున్న నామినేషన్ల ప్రక్రియ, అభ్యర్థులకు కల్పించిన సదుపాయాలు, ఎన్నికల నిర్వహణకు చేపట్టిన ఏర్పాట్లను ఆమె సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను పరిశీలించిన జిల్లా ఎన్నికల పరిశీలకురాలు, అభ్యర్థులకు నామినేషన్ దాఖలుకు అవసరమైన ఫారాలను అందుబాటులో ఉంచిన విధానం, నామినేషన్ల స్వీకరణకు సంబంధించిన ఏర్పాట్లు, ప్రక్రియ నిర్వహణలో అనుసరిస్తున్న విధివిధానాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు ఎన్ని నామినేషన్లు దాఖలయ్యాయి, నామినేషన్ల స్వీకరణకు సంబంధించి చేపట్టిన ఏర్పాట్లు ఏమిటి, అభ్యర్థులకు అవసరమైన సమాచారం, ఫారాలు ఏ విధంగా అందజేస్తున్నారు వంటి అంశాలపై వివరాలు సేకరించారు. నామినేషన్ల ప్రక్రియకు సంబంధించిన రికార్డులు, కార్యాలయంలో అందుబాటులో ఉన్న ఏర్పాట్లను కూడా పరిశీలించి ఎన్నికల ప్రక్రియ నిర్వహణ తీరును సమీక్షించారు. రెండవ సాధారణ పురపాలక ఎన్నికల నేపథ్యంలో మేయర్ ఎన్నికకు సంబంధించిన నామినేషన్ల ప్రక్రియను ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా నిర్వహిస్తున్న తీరును జిల్లా ఎన్నికల పరిశీలకురాలు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో చేపట్టిన ఏర్పాట్లను పరిశీలిస్తూ, నామినేషన్ల ప్రక్రియకు సంబంధించిన ప్రస్తుత పరిస్థితిపై అధికారుల నుంచి సమగ్ర సమాచారం పొందారు. విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలోని మొత్తం 86 డివిజన్లలో ఎన్నికల నిర్వహణకు సంబంధించి కొనసాగుతున్న పరిస్థితులపై చర్చించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో విజయవాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్, ఎన్నికల నోడల్ అధికారి ఏ. రవీంద్రరావు, సంబంధిత ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.



# కొలనుకొండ సుగాలి కాలనీలో వైభవంగా శ్రీదేవి శరణ్ నవరాత్రి ఉత్సవాలు



- అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలి
- కొమ్మారెడ్డి, కళ్ళం,జంగాల,సామల3 వేల మందికి అన్నదానం

తాడేపల్లి, అక్టోబర్ 17, మనం న్యూస్: కొలనుకొండ సుగాలి కాలనీ కత్తులపేటలో కేకేయూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీశ్రీశ్రీ దేవి శరణ్ నవరాత్రి ఉత్సవాలు ఎనిమిదో వార్షికోత్సవం సందర్భంగా వైభవంగా కొనసాగుతు న్నాయి. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని దర్శించుకున్న టీడీపీ తాడేపల్లి మండల మాజీ అధ్యక్షులు కొమ్మారెడ్డి కిరణ్, గుంటూరు పార్లమెంట్ తెలుగు రైతు అధ్యక్షులు కళ్ళం రాజశేఖరరెడ్డి,తెలుగు యువత గుంటూరు పార్లమెంట్ ఉపాధ్యక్షులు జంగాల వెంకటేష్, తాడేపల్లి మండల జనసేన పార్టీ మండల అధ్యక్షులు సామల నాగేశ్వరరావు అమ్మవారి ఉత్సవాల నిర్వహణను అభినందించారు.ఈ సందర్భంగా కొమ్మారెడ్డి కిరణ్ మాట్లాడుతూ దసరా పండుగ తెలుగు ప్రజలతో పాటు దేశవ్యాప్తంగా ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకునే పండుగని అన్నారు. నవరాత్రుల్లో అమ్మవారు తొమ్మిది అవతారాల్లో భక్తులకు దర్శనమిస్తారని, మూలా నక్షత్రం సందర్భంగా సరస్వతీ దేవిని దర్శించు కోవడం విద్యార్థులకు ప్రత్యేకమని పేర్కొన్నారు. కొలను కొండ,సుగాలి కాలనీలో గత ఎనిమిదే ళ్లుగా కేకేయూ ఆధ్వర్యంలో వేలాది మంది భక్తుల మధ్య ఉత్సవాలు వైభవంగా నిర్వహించడం అభినందనీ యమన్నారు. ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకోవడం ఆనందం గా ఉందని, అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలంతా సుఖసంతోషా లతో ఉండాలని ఆకాంక్షిం చారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ ప్రత్యేక శ్రద్ధతో దేవాలయాల్లో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. మంగళగిరి నియోజకవర్గంలోని దేవాలయాల్లో అవసరమైన సౌకర్యాలు కల్పించాలని అధికారులకు నారా లోకేష్ ఆదేశాలు ఇచ్చారని పేర్కొంటూ భక్తులందరికీ దసరా శుభాకాంక్షలు తెలిపారు.కళ్ళం రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ కేకేయూ ఆధ్వర్యంలో ఎనిమిదేళ్లుగా శ్రీదేవి శరణ్ నవరాత్రి ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించడం అభినంద నీయమన్నారు.ఉత్సవాలకు ఆహ్వానించిన నిర్వాహ కులకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా భక్తులు దసరా నవరాత్రుల ను ఆనందంగా జరుపుకో వాలని ఆకాంక్షించారు. జంగాల వెంకటేష్ మాట్లాడుతూ దేవాలయాలకు ఉచిత విద్యుత్, విద్యుత్ దీపాలంకరణ సౌకర్యాలు కల్పించిన రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయు డుకు, మంగళగిరి ఎమ్మెల్యే, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. సుగాలి తాండ ప్రాంతంలో ఎనిమిదేళ్లుగా దేవి శరణ్ నవరాత్రి ఉత్సవాలను సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ ఏడాది కూడా స్థానికుల సహకారంతో ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. అన్నదాన కార్యక్రమానికి మంత్రి, స్థానిక ఎమ్మెల్యే నారా లోకేష్ సహకారంతో సుమారు 250 కిలోల బియ్యం అందించడం సంతోషకరమన్నారు. నియోజకవర్గంలో పండు గలు, దేవి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అన్నదాన కార్యక్రమాలకు బియ్యం అందిస్తూ లోకేష్ సహకరిస్తున్నారని కొనియాడారు.సామల నాగేశ్వరరావు మాట్లాడు తూ అమ్మవారి కృప కాలనీ ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షిస్తూ కేకేయూ నిర్వాహకులకు అభినంద నలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ గ్రామ కంచర్ల రంగారావు,టీడీపీ మైనార్టీ నాయకులు షేక్ కాలేషా,ప్రధాన కార్యదర్శి బళ్ళు నాగరాజు,బీసీ సెల్ నూతక్కి నాగేశ్వరరావు, పుషులురి శ్రీనివాసరావు, ఎస్టీ సెల్ భూక్యా భూపతి రావు( బాలాజీ) మెగా వత్ నరసింహ నాయక్, కాంట్రాగడ్డ శివరామయ్య, కొండ్ర కుంట కిరణ్,గొర రంగారావు, మాజీ ఎంపీటీసీ సభ్యులు మెగావత్ వెంకటేశ్వరరావు,షేక్ ఖాజా, ఎస్సి సెల్ తురక ఏలీయా, కొండా నాయక్,షేక్ హుసేన్, బాణావత్ పెరుమాళ్ళు, మేఘవత్ హనుమా,కె. కె.యూత్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# రాజకీయ ప్రకటనలకు ఎంసీఎంసీ ముందస్తు ధ్రువీకరణ తప్పనిసరి

- పెయిడ్ న్యూస్పై నిరంతర పర్యవేక్షణ
- జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా

నెల్లూరు, అక్టోబర్ 17 (మనం న్యూస్): స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పార్టీలు, అభ్యర్థులు రాజకీయ ప్రకటనలను ప్రచారం చేసుకునే ముందు మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) నుంచి ముందస్తు ధ్రువీకరణ పొందాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ ఏర్పాటయిందని, ఇందులో నెల్లూరు మున్సిపల్ కమిషనర్ నందన్, ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్, బుచ్చిరెడ్డి పాలెం మున్సిపల్ కమిషనర్ చినబాబు, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి వేణుగోపాల్ రెడ్డి మెంబర్లుగా ఉంటారన్నారు.. ఎన్నికల సమయంలో ఎలక్ట్రానిక్ మీడియా, ప్రింట్ మీడియా, సోషల్ మీడియా, కేబుల్ నెట్వర్క్స్, రేడియో, సినిమా హాల్స్, బల్క్ ఎస్ఎంఎస్లు తదితర మాధ్యమాల్లో ప్రసారమయ్యే రాజకీయ ప్రకటనలను పర్యవేక్షించడంతో పాటు, పెయిడ్ న్యూస్పై కూడా ఎంసీఎంసీ కమిటీ నిఘా ఉంచుతుందని కలెక్టర్ తెలిపారు.. టెలివిజన్ ఛానళ్లు, కేబుల్ నెట్వర్క్స్, రేడియో, సినిమా హాళ్లు, బహిరంగ ప్రదేశాల్లో ఏర్పాటు చేసే ఆడియో, వీడియో ప్రదర్శనలు, ఈ-పేపర్లు, బల్క్ ఖిఖి లు, వాయిస్ మెసేజ్ లు తదితర మాధ్యమాల ద్వారా రాజకీయ ప్రకటనలు ప్రచారం చేయాలనుకునే రాజకీయ పార్టీలు, అభ్యర్థులు నిబంధనల ప్రకారం ముందస్తు ధ్రువీకరణ పొందాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో ఒక అభ్యర్థికి లేదా రాజకీయ పార్టీకి అనుకూలంగా వార్తల రూపంలో ప్రచురించే పెయిడ్ న్యూస్ను గుర్తించి, సంబంధిత నిబంధనల ప్రకారం పర్యవేక్షించే బాధ్యతను కూడా ఎంసీఎంసీ నిర్వహిస్తుందని కలెక్టర్ తెలిపారు.. రాజకీయ ప్రకటనల ముందస్తు ధ్రువీకరణ, సంబంధిత అనుమతులు, పెయిడ్ న్యూస్ పర్యవేక్షణకు సంబంధించిన వివరాల కోసం నెల్లూరు కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఎంసీఎంసీ సెల్ను సంప్రదించాలని కలెక్టర్ సూచించారు..కావున, ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులు, రాజకీయ పార్టీలు ఎన్నికల నిబంధనలను పాటిస్తూ, రాజకీయ ప్రకటనల ప్రచారానికి అవసరమైన ముందస్తు ధ్రువీకరణ పొందాలని కలెక్టర్ సూచించారు. రాజకీయ ప్రకటనల ధృవీకరణ కోసం సంబంధిత ప్రకటన ప్రసారం, ప్రచారం లేదా ప్రదర్శన ప్రారంభ తేదీకి కనీసం మూడు రోజుల ముందుగా నిర్దేశించిన ప్రొఫార్మా లో ఇఇ కి దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన అనుబంధం-ఎ నమూనాలో దరఖాస్తుతో పాటు ప్రతిపాదిత ప్రకటనకు సంబంధించిన ఎలక్ట్రానిక్ రూపంలోని రెండు కాపీలు, ధృవీకరించిన ట్రాన్స్క్రిప్ట్, ప్రకటన తయారీ ఖర్చు, ప్రసారం లేదా ప్రదర్శనకు అయ్యే అంచనా వ్యయం తదితర వివరాలను సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు.ప్రకటనలు ఎన్నికల చట్టాలు, ఎన్నికల ప్రవర్తనా నియమావళికి అనుగుణంగా ఉండాలని, కమిటీ సూచించిన మార్పులు లేదా తొలగింపులను సంబంధిత రాజకీయ పార్టీలు, అభ్యర్థులు నిర్ణీత సమయంలో అమలు చేయాలని పేర్కొన్నారు. కమిటీ ధృవీకరణ పొందిన ప్రకటనలను పోలింగ్ ముగియడానికి నిర్ణయించిన సమయానికి ముందు 48 గంటల నిషేధిత కాలంలో ప్రచారం కోసం ఉపయోగించరాదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, స్వేచ్ఛాయుతమైన మరియు నిష్పక్షపాతమైన ఎన్నికలు, అన్ని రాజకీయ పార్టీలు మరియు అభ్యర్థులకు సమాన అవకాశాలు కల్పించడమే ఈ మార్గదర్శకాల ప్రధాన ఉద్దేశమని జిల్లా కలెక్టర్ తెలిపారు. రాజకీయ పార్టీలు, పోటీ చేసే అభ్యర్థులు, మీడియా సంస్థలు రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.



# నందిగామలలో ఎనిమిదవ కౌన్సిలర్ గారాటకొండ వెంకటరమణ సతీమణి లక్ష్మి

- కరుడుగట్టిన టిడిపి కుటుంబం నుండి వచ్చిన రాటకొండ వెంకటరమణ





నందిగామ,అక్టోబర్ 17,మనం న్యూస్: నందిగామ పట్టణంలో పార్టీ ఆవిర్భావం నుండి టిడిపి కార్యకర్తగా సభ్యత్వం తీసుకోవడం అప్పటి నుండి ఇప్పటివరకు ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య వెంట నిత్యం ఉంటూ అనేక నిరసనలు, ధర్నాలు, పోరాటాలలో మరియు పార్టీ కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొని కొనసాగుతూ ఉండే వ్యక్తి అని ప్రజలలో స్థానం నిలుపుకున్నారు.టిడిపి పార్టీ అయిన, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అయినా,అతనికి అపారమైన ప్రేమ అభిమానం ఉండడంతో గతంలో 12వ వార్డులో మండవ కృష్ణకుమారి కౌన్సిలర్ గెలుపు కోసం ఆమె వెంట గడప గడప తిరుగుతూ ఆమె గెలుపు కోసం కృషి చేసిన వ్యక్తి అని చెప్పుకొనటంలో సందేహము లేదు. 12వ వార్డులో పట్టు ఉన్న మనిషి అందరికీ బాగా దగ్గరగా ఉండి మనిషి 10 సంవత్సరాల నుండి ప్రజల్లో మమేకమై కలుపుగోలుతనంగా ఉంటూ ఏ సమస్య వచ్చినా వారి వద్దకు వెళ్లి ఆప్యాయంగా బాబాయి, పిన్ని, అన్నయ్య అని పిలుస్తూ అందరికీ దగ్గరగా ఉండే సుపరిచితుడు రాటకొండ వెంకటరమణ. టిడిపి అధిష్టానం పరిగణన లోకి తీసుకొని క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి సతీమణి లక్ష్మిని నూతన ఎనిమిదవ వార్డు కౌన్సిలర్ టికెట్ ఖరారు చేయాలని సౌమ్యని వార్డులో కూటమి ప్రజలు ఆశిస్తున్నారు. సౌమ్య వద్ద ఉండే వారిలో ఇతను ఒక సైనికుడు, పార్టీని నమ్ముకున్న వారిలో నిజమైన ఒక కార్యకర్త మరి ఈ కార్యకర్తకు న్యాయం జరిగేనా? తూకాన్ని బట్టి వార్డు కౌన్సిలర్ సీటు కేటాయిస్తారా? పార్టీని నమ్ముకున్న వారికి ఆశీస్సులు ఉన్నాయా? పుట్టుకతోనే కరుడుగట్టిన టిడిపి వ్యక్తికి పార్టీలో స్థానం ఉంటుందా?ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మరి ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో వేసి చూడాల్సిందే.

# జగ్గయ్యపేటలో రెండవ రోజు చైర్మన్ కు 1, కౌన్సిలర్లకు 37 నామినేషన్ల దాఖలు




**జగ్గయ్యపేట అక్టోబర్ 17 మనం న్యూస్:** జగ్గయ్యపేట మున్సిపాలిటీ లో రెండవ రోజు చైర్మన్ అభ్యర్థిత్వానికి ఒకటి, వార్డ్ కౌన్సిల్ సభ్యులకుమొత్తం 37 నామినేషన్లు దాఖలు అయ్యాయి. జగ్గయ్యపేట మున్సిపల్ చైర్మన్ తెలుగుదేశం అభ్యర్థిగా ఆచంట సునీత నామినేషన్ను దాఖలు చేశారు. వార్డ్ కౌన్సిలర్లకు సంబంధించి సిపిఐ పార్టీ 8,10, 19 వార్డులలో మూడు నామినేషన్ దాఖలు చేయగా, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున ఒకటవ వార్డులో రెండు, రెండవ వార్డులో రెండు, మూడవ వార్డులో రెండు, ఐదవ వార్డులో ఒకటి ,ఏడవ వార్డులో ఒకటి, 9వ వార్డులో ఒకటి, 14వ వార్డులో రెండు, 15వ వార్డులో రెండు, 17 వ వార్డులో రెండు, 20 వార్డులో రెండు, 22 వ వార్డు లో 3 , 27 వార్డులో ఒకటి , 28 వార్డు 3, 30 వ వార్డులో ఒకటి, 32వ వార్డులో రెండు , 35వ వార్డులో ఒకటి చొప్పున మొత్తం 28 నామినేషన్లు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున దాఖలు అయ్యాయి. జనసేన పార్టీ తరఫున 20వ వార్డులో ఒక నామినేషన్ దాఖలు అయింది. తెలుగుదేశం పార్టీ తరఫున 27వ వార్డులో ఒకటి, 32 వ వార్డులో ఒక నామినేషన్ దాఖలు అయింది. ఇండిపెండెంట్గా 30 వార్డులో రెండు ,35 వ వార్డులో ఒకటి మొత్తం మూడు నామినేషన్లు దాఖలు అయినట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు.

## సోనీ నుంచి కొత్త అల్ట్ పవర్ సౌండ్ పార్టీ స్పీకర్లు




**గాంధీనగర్ అక్టోబర్ 17 మనం న్యూస్:** ప్రముఖ ఎలక్ట్రానిక్స్ సంస్థ సోనీ ఇండియా, మెరుగైన ధ్వని, శక్తివంతమైన బాస్తో రెండో తరం అల్ట్ పవర్ సౌండ్ పార్టీ స్పీకర్లను విడుదల చేసింది. అల్ట్ టవర్ 5, అల్ట్ టవర్ 7, అల్ట్ టవర్ మ్యాక్స్ మోడళ్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. అల్ట్ టవర్ 5 మోడల్ 300 వాట్ల సౌండ్ అవుట్పుట్తో పాటు గరిష్ఠంగా 20 గంటల బ్యాటరీ లైఫ్, వాటర్ రెసిస్టెన్స్, ఆకర్షణీయమైన ఎల్ఈడీ లైటింగ్ను కలిగి ఉంది. దీని ధర రూ.34,990. అల్ట్ టవర్ 7 మోడల్ 420 వాట్ల శక్తివంతమైన ధ్వని, 360 డిగ్రీల పార్టీ సౌండ్, గరిష్ఠంగా 30 గంటల బ్యాటరీ లైఫ్తో రూపొందించారు. దీని ధర రూ.49,990. అత్యంత శక్తివంతమైన అల్ట్ టవర్ మ్యాక్స్ 2,150 వాట్ల సౌండ్ అవుట్పుట్, 100 ఎల్ఈడీల లైటింగ్తో ఆకట్టుకోనుంది. దీని ధర రూ.1,39,990. డీజే కనెక్టివిటీ, కరాకే సదుపాయాలు, మల్టీ-స్పీకర్ కనెక్షన్లు ఈ మోడళ్ల ప్రత్యేకతలు. అల్ట్ టవర్ 5, అల్ట్ టవర్ 7 మోడళ్లు అక్టోబర్ 8 నుంచి సోనీ రిటైల్ స్టోర్లు, అమెజాన్లో అందుబాటులో ఉండగా, అల్ట్ టవర్ మ్యాక్స్ నవంబర్ 15 నుంచి విక్రయానికి రానుంది. లాంచ్ ఆఫర్లో భాగంగా ఎంపిక చేసిన మోడళ్లపై క్యాష్బ్యాక్ సదుపాయాలను సంస్థ ప్రకటించింది.

## ఏపీలో సీగ్రామ్స్ ఎక్స్క్లమేషన్ బ్రాండ్స్



**గుంటూరు అక్టోబర్ 17 మనం న్యూస్:** పెర్నోడ్ రికార్డ్ ఇండియా ఆంధ్రప్రదేశ్లో సీగ్రామ్స్ ఎక్స్క్లమేషన్ బ్రాండ్ను ప్రారంభించింది. గత 30 ఏళ్లలో సంస్థ చేపట్టిన ప్రతిష్టాత్మక ఆవిష్కరణల్లో ఇది ఒకటని ప్రకటించింది. విస్కీ, వోడ్కా, జిన్, రమ్, బ్రాందీ అనే ఐదు రకాల స్పిరిట్స్ను ఒకే బ్రాండ్ పరిధిలో, ఒకే ధరల శ్రేణిలో అందించడం దీని ప్రత్యేకత. 26-30 ఏళ్ల వయస్సు గల యువ వినియోగదారులను లక్ష్యంగా చేసుకుని, అందుబాటులో ఉండే ప్రీమియం ధరల్లో విభిన్న రుచులను అందించడమే లక్ష్యంగా రూపొందించారు. ప్రతి ఏడాది రెండు కోట్లకు పైగా వినియోగదారులు చట్టబద్ధమైన మద్యపాన వయస్సులోకి ప్రవేశిస్తున్న నేపథ్యంలో ఈ బ్రాండ్కు అవకాశాలు ఉన్నాయని సంస్థ పేర్కొంది. పెర్నోడ్ రికార్డ్ ఇండియా సీఈఓ జీన్ టోబౌల్ మాట్లాడుతూ, ఆధునిక వినియోగదారుల అభిరుచులు, సామాజిక సమావేశాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఎక్స్క్లమేషన్ను రూపొందించినట్లు తెలిపారు. ఐదు విభాగాల్లోనూ ప్రత్యేకమైన తయారీ విధానాలు, రుచులు, డిజైన్లతో ఉత్పత్తులను అందిస్తున్నట్లు వివరించారు. విస్కీలో స్కాచ్ మాల్ట్స్, బ్రాందీలో భారతీయ, ఫ్రెంచ్ ద్రాక్ష మిశ్రమం, రమ్లో భారతీయ బెల్లం రమ్తో పాటు జమైకా స్పిరిట్స్ వినియోగించడం ప్రత్యేకతలని సంస్థ వెల్లడించింది.

# జగ్గయ్యపేట మున్సిపల్ చైర్మన్ టీడీపీ (రెబల్ )అభ్యర్థి గా నామినేషన్ దాఖలు చేసిన తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆచంట సునీత

▸▸ **తన అభ్యర్థిత్వాన్ని పరిశీలించాలని అధిష్టానానికి ఆచంట సునిత వినతి**



**జగ్గయ్యపేట అక్టోబర్ 17 మనం న్యూస్:** తెలుగుదేశం పార్టీ మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్నానని తాను గత కొన్ని సంవత్సరాలుగా తెలుగుదేశం పార్టీ చేస్తున్న సేవలను పరిగణలోకి తీసుకొని తన నామినేషన్ అధిష్టానం పరిగణలోకి తీసుకోవాలని తెలుగు దేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆచంట సునీత అన్నారు. తెలుగుదేశం పార్టీ జగ్గయ్యపేట మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా నరేంద్రుల వినీతను పార్టీ ప్రకటించిన విషయం విధితమే. కాగా తెలుగుదేశం చైర్మన్ అభ్యర్థిత్వాన్ని ఆశిస్తున్న తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి రాష్ట్ర అంగన్వాడీ విభాగం అధ్యక్షురాలు ఆచంట సునీత శనివారం తెలుగుదేశం అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేయటం పట్టణంలో తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ సందర్భంగా ఆచంట సునీత మాట్లాడుతూ తన అభ్యర్థిత్వాన్ని గుర్తించి బలపరచాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్, ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య), కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురామ్ ను ఆమె కోరారు. ముప్పై ఏళ్లుగా పార్టీలో ఉంటూ ఎంతో సేవ చేశానని ఆచంట సునీత అన్నారు. గతంలో రెండుసార్లు తెలుగుదేశం పార్టీ తరఫున కౌన్సిలర్గా పోటీ చేసి ఓడిపోయానని,అయినా నిబద్ధతతో పార్టీలోనే కొనసాగుతున్నానని సునీత తెలిపారు. గత అరాచక పాలనలో తనపై 25 కేసులు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. పోరాటాలు చేసిన మహిళలకు అవకాశాలు ఇవ్వాలని పార్టీ అధిష్టానాన్ని ఆచంట సునీత కోరారు. పార్టీ ఆవిర్భావం నుంచి మహిళలను టీడీపీ ఎంతో ప్రోత్సహిస్తోందని, స్థానిక సంస్థల ఎన్నికల్లో యాభై శాతం రిజర్వేషన్లు ఇచ్చిన పార్టీ తెలుగుదేశం పార్టీయేనని ఆమె గుర్తుచేశారు. తన అభ్యర్థిత్వాన్ని పార్టీ బలపరుస్తుందని ఆశిస్తున్నానని తెలిపారు. పార్టీకి కష్టకాలంలో అండగా నిలిచి పని చేశానని అనేక కేసులను ఎదుర్కొన్నానని అన్నారు. తన కష్టానికి, పోరాటానికి చైర్మన్ పదవికి అర్హురాలినని భావిస్తున్నానని అన్నారు. చైర్మన్ సీటు మహిళా రిజర్వేషన్ అయిన నేపథ్యంలో పార్టీకి ఎనలేని సేవ చేసిన ఓ మహిళగా తన అభ్యర్థిత్వాన్ని పరిశీలించాలని ఆచంట సునీత అధిష్టానాన్ని కోరారు.



## శ్రీ గోవిందమాల భక్తసమాజం ఆధ్వర్యంలో అన్నవితరణ



**గాంధీనగర్, అక్టోబర్ 17 మనం న్యూస్:** శ్రీ గోవిందమాల భక్తసమాజం ఆధ్వర్యంలో అన్నవితరణ కార్యక్రమం నిర్వహించారు. గోవిందగురు స్వామి ఏనుగుల వెంకట గాంధీబాబు ఆధ్వర్యంలో శనివారం పాత ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో ఈ కార్యక్రమం జరిగింది.కమిటీ సభ్యులు పుప్పాల అప్పారావు చేతుల మీదుగా పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం భక్తులకు అన్నవితరణ చేశారు. గత ఆరు సంవత్సరాలుగా నిరంతరంగా అన్నవితరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. దాత సానికొమ్ము ప్రసాద్ రెడ్డి సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఏనుగుల వెంకట శ్రీనివాస్, గోపి చందన సురేష్, గద్దల ధనలక్ష్మి, దత్తి జ్యోతి, పబతి కృష్ణ, యర్రంశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# చైర్మన్ అభ్యర్థిత్వం నుంచి వెనక్కి తగ్గటం గూర్చి తనపై అసత్య ఆరోపణలు ప్రచారం చేస్తున్నారు

▸▸ **మాజీ మున్సిపల్ చైర్మన్ ఇంటూరి రాజగోపాల్ ( చిన్న) ఆవేదన**



**జగ్గయ్యపేట అక్టోబర్ 17 మనం న్యూస్ :** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చైర్మన్ అభ్యర్థిత్వం నుంచి తన సతీమణి ఇంటూరి శ్రీలత వెనక్కి తగ్గటం పై తన గురించి కొందరు అసత్య ఆరోపణలు చేస్తున్నారని అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారంటూ మాజీ మున్సిపల్ చైర్మన్ ఇంటూరి రాజగోపాల్( చిన్న) ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం ఆయన పాత్రికేయులకు విడుదల చేసిన ఒక ప్రకటనలో ఎన్నికల నోటిఫికేషన్ వచ్చి, చైర్మన్ స్థానం మహిళ జనరల్ అయిన తరుణంలో జగ్గయ్యపేట పార్టీ ఇన్చార్జి తన్నీరు నాగేశ్వరరావు మరికొందరు సన్నిహితులు తన భార్యను చైర్మన్ అభ్యర్థిగా నిలబెట్టాలని సూచించారని తెలిపారు. అయినా తాను అంగీకరించలేదని గత కొద్ది కాలంగా వ్యాపార పరంగా హైదరాబాదులో ఉంటున్నానని తన కార్యకర్తలకు కేడర్కు విషయం తెలియ జేయలేదని తనకు కొంత సమయం కావాలని కోరినట్లు తెలిపారు. ఈ దశలో మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా తన సతీమణి అయితే పోటీ బాగుంటుంది అంటూ సోషల్ మీడియాలో ప్రచారం జరిగిందని తెలిపారు. తనంతట తాను తన సతీమణికి చైర్మన్ అభ్యర్థిత్వం కోసం ఎవరిని అడగలేదని స్పష్టం చేశారు. జిల్లా అధ్యక్షులు దేవినేని అవినాష్ ఫోన్ చేసి మీ సతీమణి అభ్యర్థిత్వం జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకు వెళ్లామని ఆయన అంగీకరించారని తెలిపారని అయినా తాను సానుకూలత వ్యక్తం చేయలేదని తెలిపారు. పట్టణంలో విస్తృతంగా ప్రచారం జరుగుతుండడంతో తాను జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్, నియోజకవర్గ ఇన్చార్జి తన్నీరు నాగేశ్వరరావు తో తన సతీమణి పోటీ చేసే అంశాన్ని జగన్మోహన్ రెడ్డితో స్వయంగా మాట్లాడించాలని , కనీసం పార్టీ రాష్ట్ర నేత అయోధ్య రామిరెడ్డి సమక్షంలో జగన్మోహన్ రెడ్డి తో ఫోనులో అయినా మాట్లాడించాలని కోరానని అన్నారు.రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి వచ్చాక తనకు తగిన గుర్తింపు ఇవ్వాలని పార్టీ అధినేత జగన్ మోహన్ రెడ్డిని కోరాలని అనుకుంటున్నట్లు నేతల దృష్టికి తీసుకు వచ్చానని తెలిపారు. తొలుత అంగీకరించి తర్వాత ఇప్పుడు ఎలా సాధ్యమవుతుందని అన్నారని అందుకే తాను వెనక్కి తగ్గినట్లు తెలిపారు. తాను నియోజకవర్గ ఇన్చార్జి కావాలని, వచ్చే ఎన్నికలలో ఎమ్మెల్యే సీటు తనకే ఇవ్వాలని తదితర కోరికల ను కోరినట్లుగా ప్రచారం చేస్తున్నారని తాను ఒంటరిగా జగన్ ను కలుస్తానని చెప్పలేదని అందరం కలిసి కలుద్దామని చెప్పామని ప్రస్తుత ఇన్చార్జి ని పక్కన ఉంచుకొని ఆ పదవి తనకి కావాలని కోరేంత 'కు ' సంస్కారం తనకు లేదని ఇంటూరి చిన్న అన్నారు. తాను ప్రలోభాలకు లొంగే వ్యక్తిని కాదని పార్టీ ఉన్నతి కోరుకునే వ్యక్తిని అన్నారు. తనపై అభిమానంతో చైర్మన్ స్థానం కోసం తన సతీమణి ని ప్రతిపాదించిన ప్రముఖులకు వ్యక్తిగతంగా సోషల్ మీడియాలో తనకు మద్దతు తెలిపిన తన అభిమానులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పోటీలో ఉన్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు అందరూ అఖండ విజయం సాధించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.

# పేరుపోగు క్రాంతికుమార్ కేసును సీబీఐకి అప్పగించాలి



**గాంధీనగర్ అక్టోబర్ 17 మనం న్యూస్:** సాయికృష్ణ కేసులో ఆంధ్రప్రదేశ్ అత్యున్నత న్యాయస్థానం సీబీఐ విచారణకు అప్పగించినట్లుగానే, దళితుడైన పేరుపోగు క్రాంతికుమార్ కేసును కూడా సీబీఐకి అప్పగించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం విజయవాడ గాంధీనగర్లోని ఏపీ ఎంఆర్పీఎస్ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఏపీ ఎంఆర్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు పేరుపోగు వెంకటేశ్వరరావు మాదిగ, ఏపీ ఎంఆర్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు దాసరి సువర్ణరాజు పాల్గొని మాట్లాడారు. సీఐ నాగరాజు వేధింపుల కారణంగానే తాను పురుగుల మందు తాగి చనిపోతున్నానని సెల్ఫీ వీడియో ద్వారా తెలిపి ఆత్మహత్య చేసుకున్న క్రాంతికుమార్ కేసులో ఇప్పటికే 150 రోజులు గడిచినా, విచారణ పేరుతో పోలీసులు కాలయాపన చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పేరుపోగు క్రాంతికుమార్ దళితుడు కాబట్టే రాష్ట్ర ప్రభుత్వం ఈ కేసుపై నిర్లక్ష్యం వహిస్తోందని, ఇప్పటికైనా స్పందించి కేసును సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేశారు. సాయికృష్ణ కేసులో ఆంధ్రప్రదేశ్ అత్యున్నత న్యాయస్థానం తీసుకున్న నిర్ణయంతో న్యాయస్థానాలపై ప్రజలకు విశ్వాసం కలిగిందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మరియబాబు, ప్రభాకర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# దేవి శరన్నవరాత్రుల్లో ప్రత్యేక ఆకర్షణ



**36 లక్షల రూపాయల నోట్ల తో అలంకరించిన లక్ష్మీదేవి**

**నందిగామ,అక్టోబర్ 17,మనం న్యూస్:** నందిగామ మండలం మునగచర్ల గ్రామంలో ఏర్పాటుచేసిన దుర్గాదేవి విగ్రహానికి శరన్నవరాత్రుల్లో భాగంగా శనివారం లక్ష్మీదేవి అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తున్నారు. భక్తులు సమర్పించిన 36 లక్షల రూపాయల నోట్ల మాలలతో అమ్మవారు మరింత శోభాయమానంగా దర్శనమిస్తున్నారు. సింహవాహినిగా, ఆకుపచ్చ చీరలో, నోట్లతో చేసిన కిరీటం, హారాలతో అమ్మవారు భక్తులను అనుగ్రహిస్తున్నారు. శివుడు పై భాగంలో కొలువై ఉండటం విశేషం. పసుపు రంగు మండపం, విద్యుత్ దీపాల అలంకరణతో పండల్ కళకళలాడుతోంది. లక్ష్మీదేవిని ఈరోజు దర్శించుకుంటే ఆర్థిక ఇబ్బందులు తొలగి, వ్యాపార వృద్ధి, ధనలాభం కలుగుతుందని భక్తుల నమ్మకం. ఈ కార్యక్రమంలో మునగచర్ల జై దుర్గ భవాని ఉత్సవ కమిటీ మరియు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# వైసిపి పార్టీ తరుపున చైర్మన్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన చల్లా బ్రహ్మేశ్వరరావు

**నామినేషన్ కార్యక్రమానికి విచ్చేసిన వైసిపి జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్, ఎమ్మెల్సీ మొండితోక అరుణ్ కుమార్, నందిగామ ఇన్చార్జి మొండితోక జగన్ మోహన్ రావు.**



**నందిగామ,అక్టోబర్ 17,మనం న్యూస్:**నందిగామ పట్టణంలో వైసిపి పార్టీ తరుపున చైర్మన్ అభ్యర్థిగా నామినేషన్ చల్లా బ్రహ్మేశ్వరరావు పేరు కరారు అయినది. ముందుగా నందిగామ అంజనేయ స్వామి వారి దేవస్థానంలో మరియు శివాలయం, వాసవి కన్యకా పరమేశ్వరీ దేవస్థానంలో పూజలు నిర్వహించి వేద పండితుల ఆశీర్వచనాలు స్వీకరించడం జరిగింది. అనంతరం నందిగామ పూర వీధుల్లో నామినేషన్ కేంద్రానికి వైసిపి పార్టీ కి చెందిన చైర్మన్ అభ్యర్థి మరియు కౌన్సిలర్ అభ్యర్థులు ర్యాలీగా బయలుదేరి చేరుకున్నారు. వైసిపి పార్టీ చైర్మన్ అభ్యర్థి తో పాటు 16 మంది కౌన్సిలర్ అభ్యర్థులుగా నామినేషన్ దాఖలు చేసారు.

# పట్టణ ప్రజలందరి చూపు అటు వైపే



**నందిగామ,అక్టోబర్ 17,మనం న్యూస్:** మునిసిపల్ ఎన్నికలు జరుగుతున్న తరుణంలో నందిగామలో రోజురోజుకు అనుకోని పరిణామలు ఏర్పఫుతున్నాయి. ఈ తరుణంలో అక్టోబర్ 28 వతేది జరిగే నందిగామ మున్సిపల్ ఎన్నికల వేళ రసవత్తరంగా రాజకీయం మారింది. మొన్నటి వరకు 6 వ వార్డుగా ఉన్న వార్డు,ఇప్పుడు 15 వ వార్డుగా రూపాంతరం చెందింది. ఈ 15 వ వార్డులో వైసీపీ పార్టీ నుండి బి ఫారం పొందిన, సుపరిచితులు మాజీ కౌన్సిలర్ షేక్,యాకుబ్ అలీ ( కట్టప్ప) శనివారం 15 వ వార్డుకు పోటీ చేస్తూ నామినేషన్ దాఖలు చేశారు. అదే వార్డు నుండి టీడీపీ పార్టీ నుండి న్యాయవాది కరీముల్లా సోదరుడు ,షేక్ ఇమామ్ కాన్సిలర్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. ఇలాంటి తరుణంలో నందిగామ పట్టణం లోని 32 వార్డులలో 15 వార్డు పోటీ రసవత్తరంగా మారిందని. పట్టణ ప్రజలు ఏమి జరుగుతుందో అని ఆసక్తిగా గమనిస్తున్నారు.



**కంచికచర్ల, అక్టోబర్ 17(మనం న్యూస్);** కంచికచర్ల జడ్పీటీసీ గా వైసిపి నుండి కంచికచర్ల పట్టణ వైసిపి అద్యక్షుడు, మాజీ ఉప సర్పంచ్ వేమా సురేష్ బాబు ను రంగంలోకి దించేందుకు పార్టీ అధినాయకత్వం సమాలోచన చేస్తున్నట్లు తెలిసింది. కంచికచర్ల జడ్పీటీసీ జనరల్ కు రిజర్వ్ కావటంతో పార్టీలో క్రియాశీలకంగా యువనాయకత్వం వైపు అధి నాయకత్వం మొగ్గుచూపుతున్నట్లు తెలిసింది. వేమా సురేష్ బాబు తాత వేమా నరశింహారావు కంచికచర్ల సర్పంచ్ విశేష సేవలందించారు. ఆయన మనువడైన వేమా సురేష్ బాబు చదువుకునే రోజుల్లోనే రాజకీయాల పట్ల ఆసక్తి కనబరిచారు. 1994 లో అప్పటి టిడిపి మంత్రి దేవినేని రమణ అనుచరుడుగా 20 ఏళ్ళ వయసులోనే క్రియాశీలకంగా పనిచేశారు. రమణ మరణానంతరం టిడిపి ని వీడి కాంగ్రెస్ లో చేశారు. యువజన కాంగ్రెస్ లో తరువాత మండల కాంగ్రెస్ అద్యక్షుడుగా పని చేశారు. 2019 ఎన్నికల ముందు వైసిపి అధినేత జగన్ సమక్షంలో వైసిపిలో చేరారు. అప్పటి నుండి కంచికచర్ల పట్టణ వైసిపి అద్యక్షుడుగా ఉన్నారు. 2019 లో నందిగామ లో వైసిపి ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహన్రావు గెలుపు కృషి చేశారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహన్ రావు, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్ కు ముఖ్య అనుచరుడుగా ఉన్నారు. 2021 లో జరిగిన స్తానిక సంస్తల ఎన్నికల్లో తన అనుచరులను గెలిపించుకోవటమే కాకుండా మేజర పంచాయతీ కంచికచర్ల కు ఉప సర్పంచ్ గా ఎన్నికయ్యారు. కంచికచర్ల లోనే కాకుండా మండల స్తాయలో గుర్తింపు పొంధారు. వైసిపి కి కంచికచర్ల మండలంలో వేమా సురేష్ గుండెకాయగా ఉన్నారు. ఇటీవల విజయవాడ లో శాప్ కార్యాలయం వద్ద జరిగిన నిరసనలో పాల్గొన్నారని ప్రభుత్వం వేమా సురేష్ పై కేసు నమోదు చేసి రిమాండ్ కు పంపింది. జైలు నుండి విడుదలైన వేమా సురేష్ వారం క్థితం వైసిపి అధినేత జగన్ కలిశారు. ఈ తరుణం లో స్తానిక సంస్తల ఎన్నికలు రావటంతో వేమా సురేష్ ను జడ్పీటీసీ గా పోటీ చేయించాలని అధినాయకత్వం సమాలోచనలు చేస్తున్నట్లు సమాచారం. పార్టీ కి విధేయతతో పాటు, అనుచరగణం ఉన్న వేమా సురేష్ అభ్యర్తిత్వం పై అధినాయకత్వం మొగ్గు చూపుతుంది. మండలంలోని పలు గ్రామాల నాయకులు, కార్యకర్తలు వేమా సురేష్ అభ్యర్థిత్వం పై సుముఖంగా ఉన్నారు. రెండు రోజులుగా కంచికచర్ల జడ్పీటీసీ కి ఎవరైతే ప్రత్యర్దులపై పోటీ ఇస్తారో అని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహన్ రావు, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్ లు చర్చలు జరుపుతున్నారు. అయితే వైసిపి నుండి జడ్పీటీసీ కి మిగతా నాయకులు ఎవరి పేరు తెరపైకి రాలేదని, దాదాపుగా వేమా సురేష్ బాబు అభ్రర్థిత్వం ఖాయమౌతుందని వైసిపి కార్యకర్తలు అంటున్నారు.

# రెండవ రోజు భారీగా నామినేషన్లు



**నందిగామ,అక్టోబర్ 17,మనం న్యూస్:** నందిగామ పట్టణంలో మునిసిపల్ సాధారణ ఎన్నికలు-2026 లో భాగంగా నందిగామ పురపాలక సంఘు పరిధిలో తేది:17-10-2026 నాడు డా బాబు జగజీవన్ రామ్ బిల్డింగ్ నందు నిర్వహించిన రెండవ రోజు నామినేషన్ ప్రక్రియలో భాగంగా సి.పి.యం. పార్టీ -2, తెలుగుదేశం పార్టీ - 8, వైయస్ఆర్ సి.పి -25, స్వతంత్ర అభ్యర్ధులు-2. మొత్తముగా 37 నామినేషన్లు దాఖలు పరచినారు అని మునిసిపల్ కమిషనర్ జి.లోవరాజు తెలిపారు.

# నందిగామ మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా వంశీధర్



నందిగామ,అక్టోబర్ 17, మనం న్యూస్: నందిగామ మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా శాఖమూరు వంశీధర్ పేరును తెలుగుదేశం పార్టీ అధిష్ఠానం ఖరారు చేసింది. గతంలో చైర్మన్ అభ్యర్థిగా ప్రకటించబడిన డాక్టర్ కందుల అప్పారావు పేరు సాంకేతిక కారణాల వల్ల ఓటరు జాబితాలో నమోదు కాకపోవడంతో ఆయన స్వచ్ఛందంగా పోటీ నుంచి వైదొలగారు.ఈ నేపథ్యంలో విజయవాడ పార్లమెంట్ సభ్యులు శ్రీ కేశినేని శివనాథ్ (చిన్ని), ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ మరియు నందిగామ శాసనసభ్యులు తంగిరాల సౌమ్య వంశీధర్ అభ్యర్థిత్వాన్ని బలపరచడంతో పార్టీ అధిష్ఠానం ఆమోదం తెలిపింది. అభ్యర్థిగా ఖరారైన అనంతరం శాఖమూరు వంశీధర్ - స్వర్ణ దంపతులు నందిగామలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే సౌమ్యని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సౌమ్య వారికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ, పార్టీ నాయకత్వం ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, ప్రజల విశ్వాసాన్ని చూరగొనేలా పనిచేయాలని ఆకాంక్షించారు.

## సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో అభ్యర్థుల నామినేషన్

**నందిగామ,అక్టోబర్ 17,మనం న్యూస్:** నందిగామ పట్టణంలో మునిసిపల్ ఎన్నికలలో బాగంగా 14వ వార్డు కౌన్సిలర్ గా సిపిఎం అభ్యర్థులు గా సయ్యద్ బాజీద్ బి, మండూరి.కృప నందిగామ బాబుజగజ్జీవన్ రావు భవనంలో నామినేషన్ దాఖలు చేసారు.సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె.కళ్యాణ్ మాట్లాడుతూ నామినేషన్ వేసిన సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ అభ్యర్థులతో పాటు సిపిఎం పట్టణ కార్యదర్శి కే.గోపాల్ సయ్యద్ ఖాసీం,గోపి నాయక్,ఎ.శ్రీను, అజయ్ తదితరులు పాల్గొన్నారు.





## కలవర పరుస్తున్న ప్రధాన పార్టీలో అంతర్గత విభేదాలు







- **తెలుగుదేశం పార్టీకి రెబల్స్ బెడద, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి అంతర్గత పోరు**
- **తెలుగుదేశం కార్యకర్తలను విస్మయానికి గురిచేస్తున్న రెబల్స్ నామినేషన్లు**

**జగ్గయ్యపేట అక్టోబర్ 17 మనం న్యూస్:** మున్సిపల్ ఎన్నికలలో అధికార తెలుగుదేశం పార్టీలో, ప్రతిపక్ష వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో అంతర్గత పోరు పార్టీలను కలవరపరుస్తోంది. కూటమి అభ్యర్థులు కూటమి సమైక్య బలం తో జగ్గయ్యపేట మున్సిపాలిటీలో ఏక ఛత్రాధిపత్యంగా దాదాపు అన్ని స్థానాలలో అఖండ మెజార్టీతో గెలుస్తామనుకుంటున్న తరుణంలో పార్టీలో అసంతృప్తి గళాలు పార్టీని కలవర పరుస్తున్నాయి. మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి రేసులో తెలుగుదేశం పార్టీ నుంచి తెలుగుదేశం పార్టీ యువ నేత శ్రీరామ్ చిన్న బాబు సతీమణి శ్రీవల్లి, మాజీ మున్సిపల్ చైర్మన్ శ్రీరాం సుబ్బారావు కుమార్తె నరేంద్రుల వినీత, రాష్ట్ర కార్యదర్శి ఆచంట సునీత, తెలుగుదేశం సీనియర్ నేత ఎలమంచిలి రాఘవ సతీమణి ఎలమంచిలి వెంకట లక్ష్మీ ల పేర్లు ప్రముఖంగా వినిపించిన అధిష్టానం నరేంద్రుల వినీత పేరును ఖరారు చేస్తూ ప్రకటించింది. అంతా సవ్యం గా సాగుతుందను కుంటుండగా అధిష్టానం బి ఫామ్ విషయంలో స్పష్టత ఇవ్వకపోవడం, అలానే, శనివారం తెలుగుదేశం అభ్యర్థిగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆచంట సునీత నామినేషన్ దాఖలు చేయటం, మరో రెబల్ అభ్యర్థిగా ప్రముఖ వైద్యురాలు డాక్టర్ బొజ్జ సౌమ్య తాను నామినేషన్ దాఖలు చేస్తానని ప్రకటించడం తెలుగుదేశం లో ఏం జరుగుతోందనే కలవరం కార్యకర్తలలో కలుగుతోంది. డాక్టర్ బొజ్జ సౌమ్య పార్టీలో కష్టపడ్డ వారికి ఫలితం దక్కటం లేదనే అభిప్రాయంతో పోటీకి దిగుతున్నట్లు గా తెలుస్తోంది. తెలుగుదేశం పార్టీలో రెబల్స్ నామినేషన్ దాఖలు చేసిన ఆచంట సునీత, నామినేషన్ దాఖలు చేయనున్న డాక్టర్ బొజ్జ సౌమ్య లు వీరు ఇరువురు కమ్మ సామాజిక వర్గానికి చెందిన వారు కావటం విశేషం. తెలుగుదేశం బిజెపి జనసేన కలయికతో కూటమిగా ఉన్న అధికార పార్టీలో పట్టణంలోని 36 వార్డులలో కనీసం 30కి తగ్గకుండా గెలుస్తామనే ధీ మాతో ఉన్న తెలుగుదేశం పార్టీకి చైర్మన్ అభ్యర్థిత్వం విషయంలో ఎదురవుతున్న సమస్యలను ఎలా పరిష్కరించు కుంటుంది అసంతృప్తులను ఎలా బుజ్జగిస్తుంది అనేది వేచి చూడాల్సి ఉంది. ఇక వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విషయానికి వస్తే తొలు త వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున చైర్మన్ అభ్యర్థిగా ప్రస్తుత వైస్ చైర్మన్ హఫీ జున్నీస పేరు వినిపించినా, మాజీ మున్సిపల్ చైర్మన్ ఇంటూరి రాజగోపాల్ సతీమణి ఇంటూరి శ్రీలత పేరు తెరపైకి వచ్చి అభ్యర్థిత్వం దాదాపు ఖరారు అని తెలుగుదేశం పార్టీకి ధీటైన అభ్యర్థి. శ్రీలత అంటూ విస్తృతంగా ప్రచారం జరుగుతున్న తరుణంలో అనూహ్యంగా శ్రీ లత పోటీ నుంచి తప్పుకోవటం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలోని కార్యకర్త లకే కాక పేట వాసులను విస్మయానికి గురి చేసింది. దీనిపై అనేక కథనాలు పట్టణంలో విస్తృతంగా ప్రచారం జరిగాయి. దీనిపై మాజీ మున్సిపల్ చైర్మన్ ఇంటూరి రాజగోపాల్ వివరణ ఇచ్చుకున్నారు. జగ్గయ్యపేటలో మున్సిపాలిటీ ఎన్నిక లలో కూటమి హవా తో ఏకపక్షంగా సాగుతుంది అనుకుంటున్న తరుణంలో తెలుగుదేశం పార్టీలో చైర్మన్ అభ్యర్థిత్వంపై పలువురు వెనక్కి తగ్గకపోవడం నామినేషన్లకు సైతం దాఖలు చేయడం, పై పట్టణంలో విస్తృతంగా చర్చ సాగుతోంది. ఇక జనసేన విషయానికి వస్తే కూటమిలో భాగంగా తనకు వచ్చే స్థానాలు అభ్యర్థుల ఎంపికల విషయంపై దృష్టి సారించింది. నామినేషన్లకు చివరి రోజు అయిన ఆదివారం తెలుగుదేశం పార్టీ నుంచి చైర్మన్ స్థానంకై ఎవరు నామినేషన్ దాఖలు చేస్తారు. నామినేషన్ల ఉపసంహరణ సమయానికి ఎవరు అభ్యర్థిగా ఉంటారు అధిష్టానం ఎవరికి బి ఫామ్ ఇచ్చి అసమ్మతి నేతలను ఎలా బుజ్జగిస్తారు అనేది వేచి చూడాల్సి ఉంది.

## కూటమి ధర్మాన్ని పాటిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తా

- **మంత్రి కందుల దుర్గేష్**

**హైదరాబాద్,అక్టోబర్,17,(మనం న్యూస్):** స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో నిడదవోలు నియోజకవర్గంలో జనసేన పార్టీలోకి భారీగా చేరికలు ప్రారంభమయ్యాయి. శనివారం నిడదవోలు పట్టణంలోని రోటరీ క్లబ్లో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి, స్థానిక శాసనసభ్యులు కందుల దుర్గేష్ ఆధ్వర్యంలో నిడదవోలు పట్టణం, నిడదవోలు మండలం వ్యాప్తంగా దాదాపు 500 మందికి పైగా వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు జనసేన పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరించి, పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ... 'జనసేన పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేయడమే మా ప్రధాన లక్ష్యం. డిప్యూటీ సీఎం, జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఆశయాలు, సిద్ధాంతాలు,, కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై నియోజకవర్గవ్యాప్తంగా అనేకమంది పార్టీలోకి రావడం శుభపరిణామం. రాబోయే రోజుల్లో నియోజకవర్గంలో మరిన్ని భారీ చేరికలు ఉండబోతున్నాయి' అని తెలిపారు. పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ... కూటమి ధర్మాన్ని పాటిస్తూ, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ లక్ష్య సాధనకు, పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా క్రమశిక్షణతో పనిచేస్తామని స్పష్టం చేశారు. వివరాల్లోకి వెళ్తే..నిడదవోలు మండలం కోరుమామిడి గ్రామం బీసీ సంఘం అధ్యక్షులు నాని ఆధ్వర్యంలో 20 మంది, ఉనకరమిల్లి నుండి రోటరీ క్లబ్ మాజీ ప్రెసిడెంట్ మీసాల ప్రసాద్, యాండ్ర అబ్బులు ఆధ్వర్యంలో



80-100 మంది జాయిన్ అయ్యారు. సమిశ్రగూడెం నుండి ఉప్పలూరి రామ్మోహన్, పండు ఆధ్వర్యంలో దాదాపు 59 మంది జనసేన పార్టీలో చేరారు. సింగవరం, ఆంజనేయపురం గ్రామం నుండి పెనుమత్స చందు ఆధ్వర్యంలో 100 మంది, పందలపర్రు నుండి గ్రామ జనసేన నాయకుల ఆధ్వర్యంలో 50 మంది, నిడదవోలు పట్టణంలోని చర్చిపేట నుండి తూర్పుగోపు సాగర్ ఆధ్వర్యంలో 30 మంది జాయిన్ అయ్యారు..3 వ వార్డు నుండి గంగుల గోపీ యాదవ్ ఆధ్వర్యంలో మరో 30 మంది జాయిన్ అయ్యారు...ఇవే గాక వివిధ ప్రాంతాల నుండి ఆయా గ్రామాల జనసేన నాయకుల ఆధ్వర్యంలో మరో 120 మందికి పైగా జనసేన లో జాయిన్ అయ్యారు.